రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ) సా.6.22
సహరి(బుధ) ఉ.4.48

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	38.0	22.0



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే శేషారావు, ప్రసాద్ తదితరులు

దుర్గేష్ గెలుపే.. మన గెలుపు

నిడదవోలు టీడీపీ నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో శేషారావు పిలుపు

నిడదవోలు, మార్చి 18 : ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే..నన్ను గెలిపించినట్లేనని నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి , మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. నిడదవోలు పట్టణంలోని లయన్స్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీకి కంచుకోట నిడదవోలు నియోజకవర్గం అన్నారు. అటువంటి నియోజకవర్గానికి తెలుదేశం, జనసేన, బీజేపీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా జనసేన నుంచి కందుల దుర్గేష్‌ను ఎంపిక చేశారన్నారు. రానున్నది తెలుగుదేశం, జనసేన, బీజేపీల ఉమ్మడి ప్రభుత్వమని అన్నారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి కందుల దుర్గేష్‌ను గెలిపించాలన్నారు. దుర్గేష్ గెలుపే మన గెలుపని అన్నారు. మన ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటి విడతలో తనకు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అనంతరం కందుల దుర్గేష్‌ను సమావేశానికి ఆహ్వానించి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పరిచయం చేశారు. దీనిలో భాగంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ మీ అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎమ్మెల్యే అయినా ఇక్కడే ఉంటానని తెలిపారు. సమావేశంలో పట్టణ మండల అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, వెలగన సూర్యారావు, తిరుపతి సత్యనారాయణ, పంచదార దుర్గాప్రసాద్, భూపతిరాజు రవివర్మ, ఉండ్రాజవరం, పెరవలి మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



కొవ్వూరు వైసీపీ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాపు కాస్తున్నా.. పదవుల్లేవ్!

- కొవ్వూరులో మళ్లీ భగ్గుమన్న విభేదాలు
- మండిపడిన వైసీపీ కాపు నాయకులు
- సమన్వయకర్తను మార్చాలని డిమాండ్
- న్యాయం చేస్తామని నాయకుల హామీ

కొవ్వూరు, మార్చి 18 : కోడ్ కూసినా కొవ్వూరు నియోజకవర్గ వైసీపీలో విభేదాలు భగ్గుమంటూనే ఉన్నాయి. గతంలో హోంమంత్రి తానేటి వనిత ఉన్న సమయంలో కొవ్వూరు వైసీపీలో రెండు వర్గాలు ఉండేవి.ఈ నేపథ్యంలో అధిష్ఠానం కొవ్వూరు నుంచి హోం మంత్రి తానేటి వనితను గోపాలపురం, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా మార్పు చేసింది. అయినప్పటికీ నియోజకవర్గంలో రెండు వర్గాలు అలానే ఉన్నాయి. నేటికీ విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. కొవ్వూరు సత్యవతినగర్‌లో సోమవారం జరిగిన సమావేశమే దానికి ఉదాహరణ. గతంలో కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్తగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్ కృష్ణ ఉండేవారు. ఇటీవల వైసీపీ అధినాయకత్వం ఆయనను తప్పించి వంకా రవీంద్రను కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. రాజీవ్‌కృష్ణను సమన్వయకర్తగా తప్పించడంతో హోంమంత్రి తానేటి వ్యతిరేక వర్గం, రాజీవ్‌కృష్ణ అనుచరగణంగా పేరుగాంచిన వర్గం నాయకులు పార్టీ కార్యక్రమాలపై కొంత కినుక వహించారు. ఏం జరిగిందో ఏమో గాని మరలా రాజీవ్‌కృష్ణకే కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్తగా వైసీపీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. దీనిపై కాపు సామాజిక వర్గ నాయకులు మండిపడుతున్నారు. నియోజకవర్గంలో పార్టీ కోసం ఎంత కష్టపడినా గుర్తింపు లభించడం లేదని వాపోతున్నారు. నియోజకవర్గంలో సమన్వయకర్తగా 50 వేల ఓటర్లు ఉన్న తమ సామాజికవర్గం నుంచే సమన్వయకర్తను నియమించాలని కాపు నాయకులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఎన్నికల వేళ వైసీపీ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.దీనిపై స్పందించిన పార్లమెంటు అభ్యర్థి డా. గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో జరిగిన తప్పిదాలు జరగవు. ఎన్నికల తరువాత కష్టపడిన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. అభ్యర్థి తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఎవరు కష్టపడతారో వారికే న్యాయం చేస్తూ అందరిని కలుపుకుని వెళతామన్నారు. మీ డిమాండ్‌ను అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతామన్నారు.కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు బండి పట్టాభిరామారావు, మైపాల రాంబాబు, అడ్డగర్ల వీరాస్వామి, తోట రామకృష్ణ, వర్రే మురళి, కొయ్యల భాస్కర్, నగళ్లపాటి శ్రీనివాస్, అడ్డూరి సుబ్బారావు, తోట లక్ష్మీప్రసన్న, గండ్రోతు శివరామకృష్ణఅల్లు శ్రీను, చిలంకుర్తి బాబి, రుద్రం వీరబాబు, గంటా చిరంజీవి, ఇతర సంఘాల నాయకులు ముదునూరి నాగరాజు, సర్పంచ్‌లు తానేటి కుమారి, మట్టా శ్రీను, ముప్పిడి విజయరావు, వరిగేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంఘనలు!

పట్టించుకోడ్!

- కొండెక్కుతున్న ఎన్నికల కోడ్
- ఇంకా తొలగని వైసీపీ హోర్డింగ్స్
- జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వాహనాలపై అదే బొమ్మ
- అక్కడక్కడా సిద్ధం అంటూ జగన్ కటౌట్లు
- గ్రామాల్లో తొలగని నువ్వే మా నమ్మకం జగన్
- చోద్యం చూస్తున్న అధికారులు
- మండిపడుతున్న ప్రతిపక్ష నాయకులు



అనుమతి ఉంటే ఎందుకిలా..

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలా...

రాజమహేంద్రవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికారుల్లో నిర్లక్ష్యం మాత్రం ఇంకా వీడిపోలేదు. ఇంకా జిల్లా వ్యాప్తంగా ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ వేలాడుతూనే ఉన్నాయి. కోడ్ వచ్చిన 24 గంటల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశించిన గడువు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. అయినా చాలా చోట్ల ఉల్లంఘనలు కనిపిస్తున్నాయి. శాఖాపరంగా కూడా స్పష్టమైన ఆదేశాలు ఉన్నా నిర్లిప్తంగా వ్యవహరిస్తుండడంపై ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకొనే అవకాశం లేకపోలేదంటున్నారు. కొన్ని చోట్ల ఎన్నికల ప్రవర్తనా నియమావళి పట్టించుకున్నట్లు కానరావడం లేదు. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ప్రధాన గేటుదాటి లోనికి అడుగుపెట్టగానే కుడిచేతివైపున జిల్లా ప్రధాన ఆసుపత్రి అని పెద్ద బోర్డు ఉంది. దానిపై జగన్, రాజశేఖరరెడ్డి చిత్రాలు ఉన్నాయి. మహాప్రస్థానం, రక్త సేకరణ వాహనాలపై అవే బొమ్మలు దర్శనమిస్తున్నాయి. ఆస్పత్రి లోపల ఆరోగ్యశ్రీ కియోస్క్‌పై ఉన్న జగన్, రాజశేఖరరెడ్డి చిత్రాలకు మొక్కుబడిగా అతికించిన కాగితాలు ఊడిపోతున్నాయి. సుమారు రెండు నెలల పాటు ఎన్నికల కోడ్ అమల్లో ఉండే అవకాశం ఉండగా బొమ్మలపై కాగితాలు అతికించడం, అవి రెండు రోజులకే ఊడిపోవడం విమర్శలకు తావిస్తోంది. తాడితోట జంక్షనులోని రైల్వే ట్రాక్ పక్కనే ఏర్పాటు చేసిన జగన్ ఫ్లెక్సీ అధికారులకు కానరాకపోవడంపై జనం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఫ్లెక్సీని కరెంటు స్తంభానికి కట్టినా పట్టింపు లేదు. జక్కంపూడి ఫౌండేషన్‌కి చెందిన మహాప్రస్థానం అంబులెన్సులో ఆస్పత్రి ప్రాంగణంలోనే పార్కింగ్ చేస్తున్నారు. అయితే దాని పై జగన్ బొమ్మ తొలగించకపోవడంపై ఆరోపణలు వినవస్తున్నాయి. నగరంలో చాలా చోట్ల ఇంకా సీఎం సిద్ధం ఫ్లెక్సీలు దర్శనమిస్తూనే ఉన్నాయి. అవి తొలగించకపోవడంపై ప్రతిపక్ష నాయకులు మండిపడుతున్నారు. మా నాయకుల ఫ్లెక్సీలు తొలగించి వైసీపీ నాయకుల ఫ్లెక్సీలు మాత్రం అలాగే వదిలేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అన్నీ ఫ్లెక్సీలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.



ప్రభుత్వాసుపత్రిలో వాహనాలపై ఇలా..



రాజమహేంద్రవరంలో జగన్ సిద్ధం ఫ్లెక్సీ



ఇక తొలగించరా!

నిడదవోలు, మార్చి 18 : ఎన్నికల ప్రవర్తనా నియమావళి అధికారులు ఖచ్చితంగా అమలు చేయాలి. అయితే కోడ్ అమల్లోకి వచ్చి మూడు రోజులు అవుతున్నా సీఎం జగన్, ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు కటౌట్స్ అధికార్లు తొలగించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిడదవోలు పట్టణంలోని సుబ్బరాజుపేటలో సోమవారం సీఎం జగన్, ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు కటౌట్ ఇలా దర్శనమిచ్చింది.

సీతానగరంలో ఇలా..

సీతానగరం,మార్చి 18 : సీతానగరం మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీకి చెందిన పలు హోర్డింగ్స్ ,కటౌట్లు ఇంకా దర్శనమిస్తూనే ఉన్నాయి. పలు గ్రామా ల్లో మా నమ్మకం నువ్వే జగన్ అన్న హోర్డింగ్స్ యథాతథంగా కనిపిస్తుంటే వెదుళ్లపంచాయతీ పరిధిలోని రాజంపేట వద్ద ప్రధాన రహదారికి పక్కనే ఉన్న వైసీపీ కటౌట్ అలాగే వదిలేశారు. తూతూమంత్రంగా చిన్న బరకం కప్పి చేతులు దులుపుకున్నా గాలికి ఆ బరకం ఎగిరిపోతోంది. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు.పంచాయతీ కార్యదర్శి సూర్యకుమారిని వివరణ కోరగా వైసీపీ నాయకులు కటౌట్‌కు ఆర్డీవో నుంచి అనుమతి తెచ్చుకున్నారని తెలిపారు.ఆ ఫ్లెక్సీకి అనుమతి ఉంటే బరకం ఎందుకు కప్పారనేది ప్రశ్నార్థకం. సీతానగరం పంచాయతీ పరిధిలోని భసవేశ్వర స్వామి గుడి సమీపంలో, రాపాక అంజనేయస్వామి గుడి సమీపంలోను జగన్ హోర్డింగ్‌లు యధాతథంగా కనిపిస్తున్నాయి





సీతానగరం, రాపాకలో ఆలయాల గోడలపై వేలాడుతున్న మా నమ్మకం నీవే జగన్ హోర్డింగ్స్

ఇసుక.. ఇష్టానుసారంగా..



- ఆగని ఇసుక అక్రమాలు
- కోడ్ వచ్చినా మారని తీరు
- పట్టని అధికార గణం
- ఏమీ చేయని టాస్క్‌ఫోర్స్
- యథేచ్ఛగా తవ్వకాలు
- నాయకుల ఇష్టారాజ్యం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఇసుక అక్రమాలు ఆగలేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికారులు నిద్ర నటించడం మానడంలేదు. అధికారులు ఇంకా వైసీపీ సేవలోనే నిమగ్నమయ్యారు. ఇంతకాలం యథేచ్ఛగా ఎన్ని అక్రమాలు జరిగినా పట్టించుకోకుండా జిల్లా యంత్రాంగం వైసీపీ సేవల్లో తరించిన సంగతి తెలిసిందే. వైసీపీ అధిష్ఠానానికి భయపడి కళ్లెదుటే అక్రమాలు, దోపిడీ జరుగుతున్నా మౌనం వహించారు. కానీ ఇవాళ ఎన్నికల షెడ్యూల్ వచ్చి మూడు రోజులు దాటిపోయింది. అయినా అఖండ గోదావరితో పాటు ఇతర ప్రాంతాల్లో ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరిగిపోతోంది. ఇసుక అక్రమాలు ఆపడం కోసం ఫిబ్రవరి 17వ తేదీన జిల్లా కలెక్టర్ ఐదుగురు సభ్యులతో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు.అది ఏర్పాటు చేసి నెల దాటిపోయింది. ఈ టాస్క్‌ఫోర్స్ సభ్యులు ఏమయ్యారో.. ఏమి చేస్తున్నారో కానీ ఇసుక అక్రమాలను ఆపలేకపోతున్నారు.

కళ్లెదుటే సాగుతున్నా..

అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయనే ఫిర్యా దుల నేపథ్యంలో ఎస్ఈబీ,మైన్స్, ఇరిగేషన్, పోలీసు, రెవెన్యూ అధికార్లతో టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు.ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కానీ ఎన్నిక కేసులు నమోదు చేశారు. గోదావరిలో అక్రమంగా డ్రెడ్జింగ్ జరిగిపోతోంది. ఒక పద్ధతి లేకుండా దోపిడీ సాగుతోంది. గతేడాది మే నెల నుంచి తవ్వేసిన ఇసుక అక్రమాలు మళ్లించడానికి గతంలో అనుమతించిన ఓ డ్రెడ్జింగ్ కాంట్రాక్టరు గత డిసెంబర్‌లో రంగంలోకి దింపి అంతా వాళ్లే చేస్తున్నట్టు రంగు పూసింది. వాళ్లు ఒక పక్క నిబంధనలు పాటించకుండా డ్రెడ్జింగ్ చేస్తున్నారు. అది కాకుండా గాయత్రి, కాతేరు, కోటిలింగాల, కొవ్వూరు డివిజన్ పరిధిలోనూ అనధికారి కంగా డ్రెడ్జింగ్‌లో రోజుకే వేలాది టన్నులు ఇసుక తవ్వేస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఇసుక తీసి ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. భద్రత చర్యల్లో భాగంగా బ్యారేజి, రోడ్ కమ్ రైలు బ్రిడ్జి, రైలు వంతెనలకు 500 మీటర్ల లోపు తవ్వకాలు నిషేధమని అధికారులు ప్రకటించారు. హద్దులు ఏర్పాటు చేసి బ్యారికేడ్లు కూడా ఏర్పాటు చేస్తారు. అయినా అసలు పట్టించుకోలేదు. వంతెన పక్క కూడా ఇసుక తవ్వేస్తున్నారు. గతంలో రోడ్ కమ్ రైలు బ్రిడ్జి పక్కన ఇసుక తవ్వడం వల్ల నిపుణుల కమిటీ హెచ్చరించింది. బ్రిడ్జికి ప్రమాదం ఉందని స్పష్టం చేసింది. అయినా ఖాతర్ చేయలేదు. ఇవాళ గామన్ బ్రిడ్జికి 800 మీటర్లకు ఇవతలే తవ్వాలనే అధికారులు పెట్టిన నిబంధన కూడా పాటించడం లేదు. బ్రిడ్జికి అతి సమీపంలో తవ్వేస్తున్నారు.కానీ ఒక్క అధికారీ పట్టించుకోవడంలేదు.ఇంకా వైసీపీ నేతలు అధికారుల మీద ఒత్తిడి తెస్తున్నారని, అందుకే వారేమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితులు ఇంకా కొనసాగితే టాస్క్‌ఫోర్స్ అధికారులు , సంబంధిత శాఖల అధికా రుల కచ్చితంగా ప్రమాదంలో పడకతప్ప దనే ప్రచారం కూడా జరుగుతోంది.

విమానాశ్రయంలోనూ ఎన్నికల తనిఖీలు

- రూ. 50 వేలు మించి నగదున్నా సీజ్
- ఏదైనా పట్టుబడినా వెంటనే అప్‌లోడ్ చేయాలి

రాజమహేంద్రవరం, మార్చి18(ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో సీజ్ చేసిన నగదు, ఇతర వస్తువుల వివరాల నివేదికను 24 గంటల్లోపు ఇవ్వాలని, ఈఎస్ఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.మాధవీలత, జిల్లా ఎస్పీ పి.జగదీశ్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమీక్షించారు.ఎన్నికల నేపథ్యంలో సీజ్ చేసి నగదు, మద్యం అమ్మకాలు, ఇతర వస్తువుల పంపిణీ వంటి వాటి వివరాలను రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ నోడల్ ఏజెన్సీలు నిర్దేశించిన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రజలు ఎన్నికల సమయంలో రూ.50వేలు కంటే ఎక్కువ మొత్తం తీసుకుని వెళ్లకూడదని, తగిన ఆధారాలు చూపకపోతే ఫ్లైయింగ్ స్క్వాడ్ సీజ్ చేస్తుందన్నారు. ఎవరైనా రూ. 10 లక్షలకు పైబడిన సొమ్ముతో దొరికినా వెంటనే సీజ్ చేస్తామని తర్వాత ఆధారాలు ధ్రువీకరిస్తే ఇస్తారన్నారు. విమానాశ్రయంలో వాణిజ్య, వాణిజ్యేతర విమానాశ్రయాలు, హెలిప్యాడ్‌లలో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, బ్యాగేజీ స్క్రీనింగ్, ఫిజికల్ చెకింగ్ నిర్వహిస్తారన్నారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ ఆడిట్ అధికారి,ఎన్‌ఫోర్స్‌మెంట్ నోడల్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా ఎక్సయిజ్ అధికారి వై.శ్రీలత, స్టేట్ జీఎస్టీ జాయింట్ కమిషనర్ జే.నీరజ,అటవీ అధికారి బి.నాగరాజు, ఐటీ అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

టెన్షన్ ఆరంభం

పది పరీక్షలు ప్రారంభం



తనిఖీ చేస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమ య్యాయి. తొలి రోజు కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో కాస్త ఆందోళన కనిపించింది. పరీక్షా కేంద్రాల వెతుకులాటతో పరుగులు పెట్టారు. పలు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్ తనిఖీ చేశారు. సదుపాయాల ఏర్పాట్లపై ఆరా తీశారు. బందోబస్తును పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 25,399 మంది విద్యా ర్థులు దరఖాస్తు చేసుకోగా మొదటి రోజు పరీక్షకు 23,998 మంది హాజరయ్యా యరని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి అత్యవసర మందులతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉంచామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలూ తీసుకోవడం జరిగిందన్నారు. పరీక్షలు జరుగుతున్న రోజుల్లో విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి వీలుగా సదుపాయాలు కల్పించామని జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు పేర్కొన్నారు. పలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.



కొవ్వూరులో విద్యార్థులను తనిఖీ చేస్తున్న విద్యాధికారులు





రూమ్ నెంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

ఎస్ఎస్‌సీ బోర్డు.. ఇదేం తీరు

ఎస్ఎస్‌సీ బోర్డు తీరుతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. పరీక్షా కేంద్రాలు ఉన్న సూల్స్ పేరును హాల్ టికెట్లలో ఇష్టానుసారం షార్ట్‌కట్‌గా ముద్రించడం అయోమయానికి దారితీసింది. హాల్ టికెట్లలో పరీక్షా కేంద్రం పేరును పూర్తిగా కాకుండా పొడి అక్షరాల్లో పొట్టిగా గజిబిజిగా రాయడంతో సరిగా అర్థంకాక తల్లిదండ్రులు, విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. కొన్ని చోట్ల పరీక్షా కేంద్రం వద్ద సిబ్బందికీ అర్థంకాని పరిస్థితి తలెత్తింది. ఒక పరీక్షా కేంద్రానికి వచ్చిన విద్యార్థులకు వారి కేంద్రం అక్కడ కాదని సిబ్బంది చెప్పడంతో ఉరుకులు పరుగులు పెట్టారు. ఉదాహరణకు కాళి స్పెషల్ మునిసిపల్ హైస్కూల్ పేరును కేఎల్పీ అని.. నాగరాజా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఒకేచోట ఉంటాయి. కానీ, హాల్ టికెట్‌పై ఆ రెండు పేర్లలోనూ ఏదీ కాకుండా నాగరాజా స్పెషల్ హైస్కూల్ అని ముద్రించారు. దీనికి తోడు ఇంటర్ పరీక్షలు కూడా కొన్ని పది పరీక్షా కేంద్రాల్లో ఉండడంతో తికమక తప్పలేదు.

నేటి నుంచి నరసన్న బ్రహ్మోత్సవాలు




కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పాల్గుణ శుద్ధ చవితి మంగళ వారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమయ్యే స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 25వ తేదీ సోమవారం శ్రీ పుష్ప యాగంతో పరిసమాప్తం కానున్నాయి.ఈ మేరకు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొండంతా విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు వేశారు. వారం రోజులు పెద్ద ఎత్తున తీర్థం జరుగుతుంది. ఈ సందర్భంగా ఎక్కడెక్కడి నుంచో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు. - 7లో



నేటి నుంచి కోరుకొండ తీర్థం

భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవానికి శుభ ఘడియలు రానే వచ్చాయి. కోరుకుండ తీర్థం మంగళవారంతో ప్రారంభమవుతోంది. పాల్గుణ శుద్ధ చవితి మంగళవారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమయ్యే స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 25వ తేదీ సోమవారం శ్రీ పుష్పయాగంతో పరిసమాప్తం కానున్నాయి.

కోరుకొండ, మార్చి 18:



చురుగ్గా ఏర్పాట్లు

ఆరురోజులు పాటు అంగరంగ వైభవంగా సాగే శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు కోసం అన్నవరం దేవస్థానం అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్, కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ ఎస్‌పీ రంగరాజభట్టర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకూడదని అన్ని ప్రభుత్వ శాఖలు, ధర్మకర్తలు, ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు, సహాయ సహకారాలతో సమన్వయం చేసుకుని స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇప్పటికే అధికారులను కోరారు. ప్రతి రోజు వైదిక, వేద, శాస్త్ర, విద్వగోష్ఠి, ధార్మిక, సంగీత, సాంస్కృతిక, జానపద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

స్వామి వారి ఆవిర్భావం

స్వామి వారు కృతయుగంలో వెలిసినట్లు వేద ప్రమాణం. 11వ శతాబ్ద కాలంలో వెలుగులోకి వచ్చినట్లు ఇక్కడ శిలాశాసనం తెలియజేస్తున్నాయి. స్వామి వారిని వ్యాస మహర్షి తండ్రి పరాసర మహర్షి అర్చించి తపస్సు చేసి సిద్ధి పొందారు. అందుకే కోరుకొండకు పరాసర గిరి అని పేరు వచ్చింది. ద్వాపర యుగంలో పాండవులు అజ్ఞాతవాసంలో ఉన్నప్పుడు ఈ కొండ వెనుక ఉన్న కొండ గృహల్లో తపస్సు చేసుకుంటూ ప్రతి నిత్యం నరసింహ స్వామిని అర్చించేవారని పురాణ గాథలు చెబుతున్నాయి. కాలక్రమేణా ఇది కోరుకొండగా ప్రసిద్ధి చెందింది. ధాన్యపు రాశి వలే కోరుగా ఉండే కొండపై స్వామి వెలిశారు కాబట్టి ఈ కొండకు కోరుకొండ అని పేరు వచ్చింది. 600లకు పైగా మెట్లు భక్తితో ఎక్కి స్వామి వారిని దర్శనం చేసుకుంటే భక్తులు కోరిన కోర్కెలు నెరవేరుతాయని ప్రతీక. ప్రస్తుతం ఇక్కడ కొండపైన ఏక కాలార్చన జరుగుతుంది. అదే విధంగా కోరుకొండపై స్వామి వారు స్వయంభూగా వెలిచారు. కోరుకొండ కొండకు సువర్ణగిరి, వేదాద్రి, పరాసర శైలము, పారిజాత గిరి అనే పేర్లు కూడా ఉన్నాయి. స్వామి వారి కొండ చుట్టూ భక్తులు గిరి ప్రదక్షిణ చేసే అవకాశం ఉంది. భారతదేశంలో అరుణాచలం తర్వాత ప్రతినిత్యం కోరుకొండ కొండ చుట్టూ భక్తులు 3 సార్లు గిరి ప్రదక్షిణ చేస్తే కోర్కెలు నెరవేరతాయని భక్తుల నమ్మకం. ప్రతి సంవత్సరం స్వామి వారి కల్యాణ మహోత్సవానికి 10 రోజులు ముందు 200 మంది భక్తులు నరసింహ మాల ధరించి ఉదయం, సాయంత్రం గిరి ప్రదక్షిణ చేస్తారు.

తరలిరానున్న భక్తులు

రాష్ట్రం నలుమూలల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా కోరుకొండ తీర్థానికి భక్తులు తరలిరానున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నవరం దేవస్థానం దత్తత దేవాలయంగా ఉన్న కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించాలని అన్నవరం దేవస్థానం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఐవీ రోహిత్ అధికారులను కోరారు. మంగళవారం సాయంత్రం పుట్టమన్ను తెచ్చుట. అంకురార్పణ, ధ్వజారోహణం, గ్రామ బలిహరణ, సేవాకాలంతో స్వామి వారి కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. రంగరాజభట్టర్ స్వీయ పర్యవేక్షణలో వైకానస ఆగమబ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక అర్చకస్వాములు పెదపాటి, పెద్దింటి, పెరవలి వార్ల స్వీయ పర్యవేక్షణలో పాంతాయ్నిక దీక్షతో ఈ వైకానస, ఆగమ, శ్రీ వైష్ణవ సాంప్రదాయక స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం లోక కల్యాణార్థం, భక్త జన సంరక్షణార్థం జరిపించనున్నారు.



స్వామి వారి చరిత్ర

మంచి కొండ రెడ్డిరాజు క్రీ.శ 1325- 1395 మధ్య కోరుకొండను రాజధానిగా చేసుకుని 70 ఏళ్ల పరిపాలించారు. ఆ సమయంలోనే కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయం దివ్య క్షేత్రంగా విరాజిల్లింది. 1340-1370 మధ్య రాజుగా ఉన్న ముమ్మిడి నాయకుడు శ్రీరంగంలోని శ్రీ వైష్ణవ గురువుల శిష్యత్వం చేసి శ్రీరంగం నుంచి కోరుకొండకు పరాసర భట్టర్ వంశీకులను తీసుకొచ్చారు. స్వామి వారి కైంకర్యాలు చేసేందుకు తీసుకొచ్చారు

ఆలయ నిర్మాణం

ముమ్మిడి నాయకుడు భార్య లక్ష్మీదాసి గొప్ప వైష్ణవ భక్తురాలు. ఆమె క్రీస్తు శకం 1353 విజయ సంవత్సరం పాల్గుణ శుద్ధ దశమి గురువారం రోహిణి నక్షత్రంలో కొండపైన దేవాలయం నిర్మాణం చేశారు. సుమారు 10 సెంట్లు వైశాల్యం గల కోరు కొండ కొండ శిఖరంపైన ఈ దేవాలయం నేటికి చెక్కుచెదరకుండా ఉంది. కొండదిగువున మరొక పెద్ద దేవాలయం నిర్మించారు.



కొండ దిగువున స్వామివారి పాదాలు

కల్యాణ మండపాలు

1353లో ముమ్మిడి నాయకుడు స్వామికి కొండపైన, కొండ దిగువున రెండు పురాతన రాతి కల్యాణ మండపాలు నిర్మించారు. స్వామి వారికి భూదానాలు, గ్రామదానాలు ఇచ్చారు. కోరుకొండ గ్రామాన్ని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి సర్వ అగ్రహారంగా ప్రకటించారు. అదే విధంగా 1100 ఎకరాల భూమిని 72 మందికి నౌకరీ ఈనం భూముల కింద ఇచ్చారు. అవి కాకుండా లక్ష్మీ దాసి స్వామి వారికి నిత్యధూపదీప నైవేద్యాలకు, పూజా ఉత్సవాలకు రెండు గ్రామాలు 300 ఎకరాల భూమిని దానం ఇచ్చారు. వాటికి 1864లో ఈనం కమిషనర్ పట్టాలు ఇచ్చారు. దాంతో ఆ భూములన్ని పట్టాలు పొందిన వారు అమ్ముకుని వారిలో చాలా మంది నేడు స్వామివారికి సేవలు చేయడం తగ్గించారు. స్వామి వారి భూములన్ని ఎహ్టేట్ అండ్ ఎబాస్‌మెంట్ యాక్ట్ ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం స్వామి వారికి 15 ఎకరాల భూమి మాత్రమే మిగిలింది. స్వామి వారి నిత్య దీప ధూప నైవేద్యాలు చేయడం కూడా కష్టంగా ఉన్న నేపథ్యంలో సుమారు 12 సంవత్సరాలు క్రితం కోరుకొండ దేవస్థానాన్ని అన్నవరం దేవస్థానం దత్తత తీసుకుంది.

కిక్ బాక్సింగ్‌లో కాంస్యం



విద్యార్థిని అభినందిస్తున్న వీసీ, ఇతర అధికారులు

దివాన్‌చెరువు, మార్చి18: అఖిల భారత విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థి సీహెచ్ దినేష్ కాంస్య పతకం సాధించినట్టు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు సోమవారం తెలిపారు. మీరట్‌లోని స్వామి వివేకానంద సుభార్తి విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో నన్నయ అనుబంధ కళాశాలైన రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న దినేష్ 81 కిలోల విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా దినేష్‌కు కాంస్య పతకాన్ని వీసీ అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, క్రీడా బోర్డు కార్యదర్శి బి.రామ్‌గోపాల్, కల్నల్ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ బి.మధుకుమార్, రాజోలు కళాశాల ఇంగ్లీషు లెక్చరర్ ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



ఆత్రేయపురం, మార్చి 18: బీటెక్ చదివినా ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఓ యువకుడు. వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం నార్కెడుమిల్లికి చెందిన నల్లి శ్రీనివాస్-అనంతలక్ష్మి దంపతులకు ఏకైక కుమారుడు శ్రీకాంత్‌కుమార్ (23). తండ్రి శ్రీనివాస్ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. తల్లి అనంతలక్ష్మి కువైట్‌లో ఉంటూ కుటుంబాన్ని పోషిస్తూ కుమారుడిని బీటెక్ వరకు చదివించింది. ఉద్యోగ ప్రయత్నాలతో విసిగివేసారిన కుమార్ ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. స్థానికులు అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆసుపత్రికి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. శ్రీకాంత్‌కుమార్ మృతితో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి.



శ్రీకాంత్

24 నుంచి స్వామివారి ఆర్జిత సేవ

అన్నవరం, మార్చి 18: అన్నవరం శ్రీవీర వెంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానం నందు ఈనెల 24 నుంచి ప్రతీ ఆదివారం స్వామివారి రథసేవ, ఆర్జీత సేవ జరుగతుంది. రథసేవలో భాగంగా స్వామి, అమ్మవార్లు ప్రాకార మండపం చుట్టూ ప్రదక్షిణ చేయు సేవలో పాల్గొనే భక్తుల టిక్కెట్ రుసుమును రూ.2500లుగా నిర్ణయించారు. రథసేవ నందు పాల్గొనే భక్తులకు రథయాత్ర ప్రారంభంలో గోత్ర నామాలతో సంకల్పం చెప్పి కండువా, రవికతో పాటు రెండు ప్రసాదం ప్యాకెట్లు అందిస్తారు. రథయాత్ర పూర్తయిన తర్వాత కుటుంబ సభ్యులకు శ్రీస్వామి అంతరాలయ దర్శనం, వేద ఆశీర్వచనం అందిస్తారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవస్థానం అధికారులు కోరారు.

చింతలూరు జాతరపై అధికారుల సమీక్ష

అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచన



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ

ఆలమూరు, మార్చి 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరు నూకాంబికా అమ్మవారి జాతర, ఉత్సవాలను అధికారులు, స్థానికులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ సూచించారు. ఏప్రిల్ 7 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాల ఏర్పాట్లపై సోమవారం ఆయన ఆలమూరు రెవెన్యూ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. జాతరకు వేలాదిగా భక్తులు తరలి రానున్న దృష్ట్యా వారికి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా చంటి పిల్లలకు ఇబ్బంది కలగకుండా చలువ పందిళ్లు వేయించాలని సూచించారు. ఏప్రిల్ 7న ప్రధాన జాతర, 8న తీర్థం, 9న జాతర మహోత్సవంతో పాటు నెల రోజులు భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులను కోరారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులతో ఆలమూరులో సమీక్షించామని, వచ్చే సమావేశాన్ని చింతలూరులో నిర్వహిస్తామని ఆర్డీవో చెప్పారు. తహసీల్దారు అనిల్‌కుమార్, ఎంపీడీవో మేరీరోజ్, రావులపాలెం సీఐ రామ్‌కుమార్, ఆలమూరు ఎస్‌ఐ శ్రీనునాయక్, నూకాంబికా దేవస్థానం ఈవో ఎంఎస్‌ఆర్ కృష్ణ, జేఏ భాస్కర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డెయిరీ ఫుడ్స్‌లో అధికారుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

దివాన్‌చెరువు, మార్చి 18: దివాన్‌చెరువులోని సంతోష్‌నగర్‌లో బాబా డెయిరీ ఫుడ్స్ షాపులో విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ, లీగల్, మెట్రాలజీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు కలసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఆ డైరీ ఫుడ్స్‌కు ప్యాకింగ్ లైసెన్సు లేకపోవడం, అవిన్ డ్రీంక్రీమ్ 30ఎంఎల్ ప్యాకెట్స్‌పై మెండిటరీ డిక్లరేషన్ లేకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు రెండు కేసులు నమోదు చేశారు. అలాగే ట్రేడ్ లైసెన్సు పొందకపోవడంతో పంచాయతీ కార్యదర్శి రూ.2,204 అపరాధ రుసుము విధించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు డైరీ నుంచి కుల్ఫీ, మీడియం ఫ్యాట్‌ఫ్రోజన్ డెజర్ట్‌ల నమూనాలను విశ్లేషణ నిమిత్తం సేకరించారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఐస్‌క్రీమ్ తయారీదారులు, స్వీట్‌స్టాల్స్, రెస్టారెంట్ల యాజమాన్యాలు వాటి పరిసరాలను, కిచెన్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అధికారులు ముత్యాలనాయుడు, భార్గవమహేష్, జగన్నాథరెడ్డి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



సాగర తీరంలో గుదారాలు ఏర్పాటు చేసుకున్న దృశ్యం

త్రివిధ దళాల విన్యాసాలకు
కాకినాడ తీరంలో ఏర్పాట్లు

సర్పవరం జంక్షన్, మార్చి 18: దేశ రక్షణ, భారత భూభాగం దురాక్రమణకు పాల్పడుతున్న ఉగ్రవాదుల నిర్మూలన, శత్రు దేశాలతో యుద్ధసమయంలో భారత త్రివిధ దళాలు నిర్వహించే త్రివిధ దళాల విన్యాసాల నిర్వహణకు నేవీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట సాగర తీరంలో నేవెల్ ఎన్‌క్లేవ్ వద్ద భారత త్రివిధ దళాలైన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ దళాలు ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే విన్యాసాలు కోసం ఆ శాఖ ఉన్నతాధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. విశాఖ నుంచి ఆర్మీ వాహనాల్లో సిబ్బంది పలు ట్రూప్‌లతో సోమవారం బీచ్‌కు చేరుకుని గుదారాలు ఏర్పాటు చేసుకున్నారు. విన్యాసాల నిర్వహణ కోసం అనువైన ప్రదేశాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. రెండు మూడు రోజుల్లో యుద్ధ ట్యాంకర్లు ఒకట్రెండు రోజుల్లో విన్యాసాల్లో పాల్గొనే వైమానిక దళం, యుద్ధ ట్యాంకర్లు ఇక్కడకు చేరుకునేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. విన్యాసాలు జరిగే సముద్ర తీరంలో పరిశుభ్రత, ప్రత్యేక శానిటేషన్ పనులను కార్యదర్శి వెంకటరత్నం ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బంది నిర్వహించారు.

లారీ ఢీకొని భార్య మృతి

భర్తకు తీవ్రగాయాలు



భార్య మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త

రాజానగరం, మార్చి 18: జాతీయ రహదారిపై తూర్పుగోనగూడెం సమీపంలో సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. గండేపల్లి మండలం ఎన్టీ రాజాపురానికి చెందిన పిల్లి లోవకుమారి(40)- భర్త దుర్గారావు అనారోగ్యం కారణంగా బైక్‌పై రాజమహేంద్రవరం ఆస్పత్రికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తున్న తరుణంలో మార్గమధ్యంలో తూర్పుగోనగూడెం సమీపంలో బైక్‌ను వెనుకవైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో లోవకుమారి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. దుర్గారావుకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో చికిత్స కోసం తరలించారు. సంఘటనా స్థలంలో భార్య మృతదేహం వద్ద దుర్గారావు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు స్థానికులను కలచివేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ఠ ఏర్పాట్లు



స్ట్రాంగ్ రూమ్ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయసునీత

రంపచోడవరం, మార్చి 18: రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆమె ఎస్పీ తూహిన్‌సిన్హా, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి నియోజకవర్గానికి సంబంధించిన రూట్ మ్యాప్‌ను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఈవీఎంల భద్రత, ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్, ఎన్నికల అధికారులకు వాహనాల ఏర్పాటు తదితర అంశాలపై సూచనలు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ మోహన్ రావు, డీటీలు సత్యనారాయణ, శివ, చైతన్య, విశ్వనాథం, సుబ్బారావు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన

త్వరలో నిర్వహించే సార్వత్రిక ఎన్నికలకు పటిష్ఠమైన చర్యలు చేపట్టామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత చెప్పారు. ఎస్పీ తూహిన్ సిన్హా, సబ్ కలెక్టరు ప్రశాంత్‌కుమార్‌తో కలిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్‌లకు జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ సంబంధించిన ఈవీఎంలను వేర్వేరుగా భద్ర పరచాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్‌కు సంబంధించి 25 కౌంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఏప్రిల్ 18 నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు



ఆత్రేయపురం, మార్చి 18: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్య కల్యాణం, తీర్థం, రథోత్సవాలను ఏప్రిల్ 18 నుంచి 24వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లపై ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం వివిధ శాఖల అధికారులతో తొలి విడత సమావేశం నిర్వహించనున్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

రెండున్నరేళ్ల చిన్నారితో సహా పది మందికి గాయాలు



చిన్నారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గోకవరం, మార్చి 18: గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో సోమవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. ఈ దాడిలో రెండున్నరేళ్ల చిన్నారి సహా 10 మందికి గాయాలయ్యాయి. బయట ప్రాంతం నుంచి గ్రామంలోకి ప్రవేశించిన ఓ పిచ్చికుక్క కనిపించిన వారిపై దాడి చేసుకుంటూ సంచరించింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు భయంతో ఇళ్లల్లోకి పరుగుల తీశారు. ఆరు బయట ఉన్న పశువులను, కోళ్లను కూడా తీవ్రంగా గాయపర్చింది. గాయపడిన వారు గోకవరం ప్రభుత్వాసుపత్రికి పరుగుల తీశారు. తీవ్రంగా గాయపడిన చిన్నారిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చివరకు పిచ్చి కుక్కను గ్రామస్థులు హతమార్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా గ్రామంలో సుమారు 20కి పైగా వీధి కుక్కలను పిచ్చికుక్క కరవడంతో గ్రామస్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కల నిర్మూలనకు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కుక్క దాడిలో గాయపడిన చిన్నారి

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

మాస్ కాపీయింగ్ లేకుండా చూడాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ విజయసునీత



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయసునీత

రాజవొమ్మంగి,మార్చి 18: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, మాస్ కాపీయింగ్‌కు ఎట్టి పరిస్థితుల్లో ఆస్కారం కల్పించవద్దని జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత ఆదేశించారు. రాజవొమ్మంగి మండలం జడ్డంగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అత్యవసర వైద్య శిబిరాన్ని పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. పాఠశాల పరిసరాల్లో 144 సెక్షన్‌ను పక్కాగా అమలు చేసి ఇతరులులోనికి అనుమతించవద్దని ఆదేశించారు. విద్యార్థులంతా ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ సూచించారు.

ప్రశాంతంగా ప్రారంభమైన టెన్త్ పరీక్షలు

మోతుగూడెం, మార్చి 18: చింతూరు మండలం మోతుగూడెం ఏపీ జెన్కో డీఏవీ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చీఫ్ సూపరింటెండెంట్ టి.ఆదయ్య, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, డీఏవీ పాఠశాల విద్యార్థులు 24 మంది, జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు 16 మంది మొత్తం 40 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారన్నారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని చెప్పారు.

కట్టుదిట్టంగా టెన్త్ పరీక్షలు

ఎటపాక, మార్చి 18: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మండలంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గౌరీదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాల, కేఎన్‌పురం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలను నిర్వహించారు. గౌరీదేవిపేట పరీక్ష కేంద్రంలో మొత్తం 113 మంది విద్యార్థులకు గాను, 112 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఒకరు గైర్హాజరయ్యారు. కేఎన్‌పురం ఆశ్రమ ఉన్నత పాఠశాల కేంద్రం పరిధిలో మొత్తం 179 మంది విద్యార్థులకు గాను 174 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఐదుగురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. రెండు పరీక్ష కేంద్రాల పరిధిలో మొత్తం 292 మంది విద్యార్థులకు 286 మంది పరీక్ష రాశారు. తొలిరోజు గౌరిదేవీపేట పరీక్షా కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేశారు.

పది పరీక్షలకు 198 మంది హాజరు

దేవీపట్నం,మార్చి18: టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 208 మంది విద్యార్థులకు గాను 198 మంది హాజరైనట్లు ఎంఈవో శిరసం బాలుదొర తెలిపారు. కొత్తవీధి ఆశ్రమ బాలురోన్నత పాఠశాల, ముసినిగుంట ఆశ్రమ బాలికోన్నత పాఠశాల, దేవీపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇందుకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు రంపచోడవరం కె.యర్రంపాలెం ఆశ్రమ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ముసినిగుంట ఆశ్రమ బాలికోన్నత పాఠశాల కేంద్రాన్ని తహసీల్దార్ పీవీ చలపతిరావు సోమవారం పరిశీలించారు.

భూసార పరీక్షలపై అవగాహన

మోతుగూడెం, మార్చి18: చింతూరు మండలం లక్కవరం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నందు వ్యవసాయ సాంకేతిక నిర్వహణ ఏజెన్సీ, ఈఎంఆర్ఎస్ స్కూల్ విద్యార్థులకు భూసార పరీక్షలపై ఆత్మ పీడీ జ్యోతిర్మయి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల దిగుబడి పెంచడంలో భూసార మట్టి నమూనా పరీక్షలు రైతులకు ఎంతో ముఖ్యమని, భూసార పరీక్షలు వలన మట్టిలోని పోషక విలువలు, భూమిలో ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకోవచ్చన్నారు. టెక్నికల్ ఏవో సరళ మాట్లాడుతూ మట్టి నమూనా సేకరణలో తీసుకునే జాగ్రత్తలను వివరించారు. అనంతరం సైన్స్ ఉపాధ్యాయుడు కె.తమ్మయ్య స్కూల్ విద్యార్థులను సమీప లక్కవరం గ్రామంలో వరి పొలాల్లో క్షేత్ర ప్రదర్శనకు తీసుకెళ్లారు. మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నిర్దేశించిన 50 మట్టి నమూనాలను విద్యార్థుల సహకారంతో గ్రామ వ్యవసాయ సహాయకులు మట్టి నమూనా సేకరిస్తారని, 25 మట్టి నమూనాలను స్కూల్‌లో పరీక్షించి రైతులకు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీఎంఏ పీడీ జ్యోతిర్మయి, టెక్నికల్ ఏవో సరళ, ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ కె.స్వామి, సైన్స్ టీచర్ కె.తమ్మయ్య, ఈఎంఆర్ఎస్ స్కూల్ యాజమాన్యం, మండల వ్యవసాయ అధికారి, మండల గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.


'విప్లవ పార్టీల అభ్యర్థులను గెలిపించాలి'

రంపచోడవరం, మార్చి 18: సార్వత్రిక ఎన్నికల్లో దోపిడీ పాలకవర్గ, అవకాశ వాద పార్టీలను ఓడించాలని న్యూ డెమోక్రసీ వంటి విప్లవ పార్టీలు బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యురాలు పి.టాన్యా అన్నారు. ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి కుంజా దూలయ్య అధ్యక్షతన స్థానిక మార్క్స్-ఎంగిల్స్ భవనంలో సోమవారం బి.రమేష్ 5వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా టాన్యా మాట్లాడుతూ చారిత్మాక గోదావరి లోయ ప్రతిఘటనోద్యమానికి దివంగత నేత రమేష్ నాలుగు దశాబ్దాలుగా ఎనలేని సేవలందించారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఏఐకేఎంఎస్ నాయకులు పి.లచ్చిరెడ్డి, కంగల బాలుదొర, ఐ.రమణ, పి.ఆదిలక్ష్మి, కొమరం రామాయమ్మ, న్యూ డెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, పీవోడబ్ల్యూ నాయకులు పి.అనసూయ, చిలకమ్మ పాల్గొన్నారు.

'వైద్యులపై చర్యలు తీసుకోవాలి'

వరరామచంద్రాపురం, మార్చి 18: రోగుల పట్ల బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న రేఖపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులపై చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. వైద్యులు బాధ్యతారాహిత్యంతో గతంలో ఓ చిన్నారి పుట్టిన కొద్ది రోజులకే మృత్యువాత పడిందన్నారు. అది డాక్టర్ నిర్లక్ష్యమేనని పత్రికల్లో వచ్చాయని ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఈ విషయంపై ఎంపీటీసీ డాక్టర్‌ను అడిగినా...సమాధానం చెప్పలేదన్నారు. డ్యూటీలో ఉన్న వేరే డాక్టర్ మాట్లాడుతూ బిడ్డను వాళ్లే వద్దనుకున్నారని అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ప్రజలు పట్ల, సిబ్బంది పట్ల ఈవిధంగా ప్రవర్తిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో పుల్లయ్యకు సీపీఎం, టీడీపీ నాయకులు మెమోరాండం ఇచ్చారు. వైద్యులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని డీఎంఅండ్‌హెచ్‌వో హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పూనెం సత్యనారాయణ, పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, సర్పంచ్ వెట్టి లక్ష్మి, టీడీపీ నాయకులు బురక కన్నారావు, బిరకా సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు.

కోడ్ కూసినా నిర్లక్ష్యం..!



వైసీపీ రంగులతో ఉన్న ఆస్పత్రి

ఎటపాక, మార్చి 18: అది గౌరీదేవిపేటలోని ప్రభుత్వ దవాఖానా... ఆ భవనానికి వైసీపీ పార్టీ రంగులను పోలిన రంగులు అద్దారు. ఇటీవల ఆ ఆస్పత్రి భవనం ప్రారంభించారు. ఆ సమయంలో ఆ భవనంపై సీఎం జగన్ ఫొటోతో పాటు వైసీపీ పథకాలకు సంబంధించిన కటౌట్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి దాదాపు 3 రోజులు అవుతున్నా ఇప్పటి వరకు ఆ కటౌట్‌ను సచివాలయ సిబ్బంది తొలగించలేదు. కోడ్ నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఆ కటౌట్‌ను సచివాలయ సిబ్బంది తొలగించకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నగరంలో రాజకీయ ప్రకటనలు నిషేధం

ఆర్‌వో, కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి18: ఎన్నికల షెడ్యూల్ ప్రకారం రాజమహేంద్రవరంలో రాజకీయ ప్రకటనలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై ప్రచార ప్రకటనలు నిషేధమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసారు. మోటారు వాహనాలు, కార్లు, ఆటోలపై రాజకీయ ప్రకటనలు ఉండరాదని, ఉంటే వెంటనే వాటిని తొలగించాలన్నారు. ఎన్నికల నియమావళిని ఎవరైనా ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

'పది' పరీక్షలు ప్రారంభం

దివాన్‌చెరువు, మార్చి 18: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పరీక్షకు హాజరైన పిల్లల వెంట తల్లిదండ్రులతోపాటు పాఠశాలలకు చెందిన కొంతమంది ఉపాధ్యాయులు పరీక్షా కేంద్రాల వద్దకు వచ్చి వారికి పలు సూచనలు చేయడం కనిపించింది. అలాగే పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన బోర్డులో విద్యార్థుల రోల్‌నెంబర్లు చూసి వారికి కేటాయించిన గదుల వివరాలను వారికి తెలియజేయడంలో పలువురు సాయపడ్డారు. ముందుగా కొంతమంది విద్యార్థులు ఆలయాలకు వెళ్లి దర్శనం చేసుకుని తమ తమ పరీక్షా కేంద్రాలకు బయలుదేరి వెళ్లారు.

కడియంలో ప్రశాంతంగా పరీక్షలు

కడియం, మార్చి 18: పదో తరగతి పరీక్షలు మండలంలో ఆరు కేంద్రాల్లో జరుగుతుండగా మొత్తం 1,049 మందికిగాను 1,023 మంది విద్యార్థులు హాజరయ్యారని, 26 మంది హాజరు కాలేదని ఎంఈవో వై.నాగేశ్వరరావు తెలిపారు.

గోకవరం మండలంలో 54 మంది గైర్హాజరు

గోకవరం, మార్చి18: మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో జరిగిన పదో తరగతి పరీక్షలకు 54 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి గౌరమ్మ తెలిపారు. గోకవరం, కామరాజుపేట, రంపయర్రంపాలెం, భూపతిపాలెం, వీరలంకపల్లి గురుకుల పాఠశాలల్లో జరిగిన పదవ తరగతి పరీక్షలకు 848 విద్యార్థులకుగాను 794 మంది హాజరైనట్టు ఆమె పేర్కొన్నారు.

అనపర్తిలో 27 మంది గైర్హాజరు

అనపర్తి, మార్చి 18: అనపర్తి మండలంలోని నాలుగు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, జీబీఆర్ కళాశాల, కుతుకులూరు ఉన్నత పాఠశాలల్లో 27 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి తెలిపారు.

బిక్కవోలులో 14 మంది..

బిక్కవోలు, మార్చి 18: మండలంలో ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు సోమవారం 14 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేదని ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మండలంలో 611 మంది పరీక్షలకు హాజరుకావల్సి వుండగా బిక్కవోలు సెంటర్‌లో ఆరుగురు, ఇళ్లపల్లిలో ఇద్దరు, పందలపాక బి సెంటర్‌లో ఆరుగురు హాజరుకాలేదన్నారు. పందలపాక ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను డీవైఈవో తిరుమలదాసు తనిఖీ చేశారు.

రాజానగరం మండలంలో..

రాజానగరం, మార్చి 18: మండలంలోని 9 పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు తెలుగు పరీక్షకు సంబంధించి 1095 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవో రామన్నదొర తెలిపారు.



రాజానగరం హైస్కూల్ పరీక్షా కేంద్రం వద్ద పదో తరగతి విద్యార్థులు

రాజానగరం హైస్కూల్ బిసెంటర్‌లో ఇద్దరు, దివాన్‌చెరువు సూర్యగ్లోబల్ ఒకరు, సంపత్‌నగరంలో ముగ్గురు, పాతతుంగపాడు ఇద్దరు పరీక్షలకు హాజరుకాలేదని చెప్పారు. నరేంద్రపురం, తోకాడ, కానవరం, దివాన్‌చెరువు హైస్కూళ్లలోని పరీక్షా కేంద్రాల్లో నూరు శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు చెప్పారు.

రంగంపేట మండలంలో 17 మంది గైర్హాజరు

రంగంపేట, మార్చి18: మండలంలో రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మొదటిరోజు తెలుగు పరీక్షకు 618 మంది విద్యార్థులకు గాను 601 మంది హాజరుకాగా 17 మంది గైర్హాజరయ్యారని, మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు జరుగుతుందని, కేంద్రాలకు అవసరమైన విద్యుత్, మంచినీటి, వైద్య సిబ్బంది ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

పరీక్షలు రాస్తున్న వసతిగృహ విద్యార్థులకు బాసటగా నిలవాలి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి18: రాజమహేంద్రవరంలో ఎస్సీ, ఎస్టీ, వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు అంబేడ్కర్ వారసులు బాసటగా నిలవాలని ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘం నాయకులు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. వసతి గృహాలకు వెళ్లి ఆయా విద్యార్థులకు అవసరమైన సహకారం అందించి ధైర్యం చెప్పాలని విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్ వర్రే శ్రీనివాసరావు

రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేసింది మేమే

వైసీపీ సిటీ అభ్యర్థి భరత్‌రామ్‌పై టీడీపీ మాజీ కార్పొరేటర్ల ధ్వజం

రాజమహేంద్రవరంసిటీ, మార్చి18: రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేసింది తామేనని నగరపాలక సంస్థ మాజీ కార్పొరేటర్లు స్పష్టంచేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్ వర్రే శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు, మాజీ కార్పొరేటర్ రెడ్డి మణేశ్వరరావు, బీజేపీ మాజీ కార్పొరేటర్ కూరగంటి సతీష్‌లు మాట్లాడారు. 2002 నుంచి 2019 వరకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ మేయర్లుగా మూడుసార్లు టీడీపీ పాలకమండలి పాలన సాగించిందని, ఈ కాలంలో నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశామన్నారు. గోదావరి గట్టు పరిరక్షణ, పార్కుల అభివృద్ధి, రోడ్ల విస్తరణ, తాగునీటి సరఫరా మెరుగుపర్చడం, ఈస్టు రైల్వేస్టేషన్‌రోడ్డు, కమ్యూనిటీ హాళ్లు, పాఠశాల భవనాల నిర్మాణాలు, రైతుబజార్ల ఏర్పాట్లు వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. చివరకు భరత్‌రామ్ నిర్మించిన హ్యాపీస్ట్రీట్‌కు రోడ్డు వేసింది కూడా తామేనన్నారు. కానీ భరత్‌రామ్ తానే అన్ని చేశానని చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నాడన్నారు. ఇటీవల పంపిణీ చేసిన పట్టాలు అధికారిక ముద్రలేకుండా ఇచ్చారని. అవన్నీ బోగస్ పట్టాలేనని ఆరోపించారు. రాజమహేంద్రవరంలో టీడీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుతో కూటమి అధికారంలోకి రాబోతోందని చిలకలూరి పేట సభ స్పష్టం చేసిందన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు ద్వారా పార్వతి సుందరి, కోసూరి చండీప్రియ, యిన్నమూరి రాంబాబు, చాన్ బాషా, కోరుమిల్లి విజయశేఖర్, జవ్వాది మురళీ కృష్ణ, మొకమాటి సత్యనారాయణ, కడలి రామకృష్ణ, తంగెళ్ల బాబి, కప్పల వెలుగుకుమారి, సింహానాగమణి, గొర్రెల సత్యరమణి, కూరాలకు తులసి, కరగాని మాధవీలత, పాలవలస వీరభద్రం, మర్రి దుర్గా శ్రీనివాస్, బూరా రమేష్, నేరుడుమిల్లి సుశీల, నాయకులు పితాని కుటుంబరావు, కరగాని వేణు పాల్గొన్నారు.




పార్టీలో చేరిన వారితో ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

కూటమి అధికారంలోకి రావడం ఖాయం

ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్.. టీడీపీలో భారీగా చేరికలు

రాజమహేంద్రవరంసిటీ, మార్చి18: వైసీపీ విధానాల పట్ల విసుగు చెందిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీస్థాయిలో టీడీపీలోకి చేరుతున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 31వ డివిజన్‌లో నేషనల్ బేసిక్ స్కూల్ మాజీ డైరెక్టర్ వైసీపీ నాయకులు చొక్కాకుల శ్రీనుబాబు, ఆర్యాపురం సత్యనారాయణస్వామి దేవస్థానం డైరెక్టర్ చొక్కాకుల వెంకటరమణి, పిల్లా వెంకటలక్ష్మి, ఆదిలక్ష్మి, సరస్వతి, పల్లవి, పైడమ్మ, అప్పాయమ్మలతోపాటు సుమారు 120 మంది వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆదిరెడ్డి వాసు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీలోకి కండువాలతో ఆహ్వానించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరినీ టీడీపీ అధినాయకత్వం గుర్తిస్తుందన్నారు. ఎన్నికల కోడ్ వచ్చింది మొదలు చాలా మార్పులు వచ్చాయన్నారు. వైసీపీ నుంచి 200 మంది తమ కూటమిలో చేరడం వైసీపీకి చెంపపెట్టు అన్నారు. రానున్నవన్నీ మంచిరోజులేనని, కూటమి అధికారంలోకి రావడం, చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెట్టడం ఖాయమన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక భరత్‌రామ్ అండ్ బ్యాచ్‌కు అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, పార్లమెంట్ తెలుగు మహిళాకమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, టీడీపీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, నాయుడుమాస్టారు, శనపత్తి సత్తిబాబు, రాంబాబులతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రాజమహేంద్రవరం 3వ డివిజన్‌లో బీసీ సాధికార సమితి శెట్టిబలిజ విభాగం రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ బొమ్మనమైన శ్రీనివాస్, జక్కంపూడి అర్జున్‌ల పర్యవేక్షణలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, నేతలు టేకుమూడి భద్రినాథ్, మంత్రమూరి రాంబాబు, అహ్మదున్నీషా పాల్గొన్నారు.



అనపర్తి మండలం లక్ష్మీనరసాపురంలో టీడీపీ, జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న ఉమ్మడి అభ్యర్థి రామకృష్ణారెడ్డి

గెలుపే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పనిచేయాలి

ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి, జనసేన నేత మర్రెడ్డి

అనపర్తి, మార్చి18: వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని రాష్ట్రాన్ని వైసీపీ రహిత రాష్ట్రంగా చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం, దుప్పలపూడి గ్రామాల్లో టీడీపీ, జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనను అరికట్టడమే ధ్యేయంగా మూడు పార్టీలు జతకట్టాయన్నారు. రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకురావడం ఎన్డీయే ప్రభుత్వానికే సాధ్యమన్నారు. రాష్ట్రంలో ఏవిధంగా దోపిడీ పాలన సాగిందో అనపర్తి నియోజకవర్గంలోనూ రూ.500 కోట్ల అవినీతి జరిగిందన్నారు. అంతేకాకుండా నాయకులపైన, కార్యకర్తలపైన అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని అన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ పది సంవత్సరాలు జనసేనాని పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రయోజనాలకోసమే పనిచేస్తున్నారని, ఆయన ఇచ్చిన పిలుపుమేరకు ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకోవల్సిన బాధ్యత ప్రతి జనసైనికుడిపైన ఉందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, వైసీపీని తరిమికొట్టాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, జనసేన నేత రావాడ నాగు, బీజేపీ నేత రామకృష్ణంరాజులు పాల్గొన్నారు.



ఆదర్శ కళాశాలలో జరిగిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రముఖులు

'రక్తదానం ప్రాణదానంతో సమానం'

గోకవరం, మార్చి18: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆదర్శ విద్యాసంస్థల ఛైర్మన్ పి.కనకరాజు అన్నారు. మండలంలోని కొత్తపల్లి ఆదర్శ బీ ఫార్మసీ కళాశాల్లో సోమవారం కాకినాడకు చెందిన లయన్స్‌క్లబ్ ప్రొఫెషనల్, ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా లయన్స్‌క్లబ్ ప్రొఫెషనల్ కాకినాడ జోన్ ఛైర్మన్ ద్వారంపూడి విపుల్, అధ్యక్షుడు రవి, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఎన్‌వీ రావు, ఆదర్శ విద్యా సంస్థల నిర్వాహకులు నాగమణి, త్రినాథరావు, శ్రీనివాస్ తదితరులు విచ్చేశారు. ఈసందర్భంగా కనకరాజు మాట్లాడుతూ టీనేజ్ వయుస్సులో రక్తాన్ని దానం చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. ప్రతీ సంవత్సరం కళాశాల్లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. సుమారు 42 మంది విద్యార్థినీ విద్యార్థులు రక్తదానం చేశారు.





జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ మాధవీలత

జాతీయ ఇన్‌స్పైర్‌కి ఎంపికైన విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

రాజమహేంద్రవరం, మార్చి18(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని సృజనాత్మకతను జోడించి నూతన ఆవిష్కరణలు చేయడం ద్వారా మరింతమంది పిల్లలకు స్ఫూర్తిగా నిలిచారని జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కి ఎంపికైన విద్యార్థులను కలెక్టర్ మాధవీలత అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి ప్రదర్శనకి ఎంపికైన కొవ్వూరు మండలం ఐ.పంగిడి జడ్పీ హైస్కూలు విద్యార్థి బోయిశెట్టి లక్ష్మణ్, సీతానగరం మండలం రఘుదేవపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థి కేఎస్‌డీ నాగేంద్ర సోమవారం కలెక్టర్‌ని కలిశారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షిస్తూ విద్యార్థులు, టీచర్లను ఆమె అభినందించారు.

డిగ్రీ సింగిల్ మేజర్ వ్యవస్థపై శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి18: డిగ్రీలో సింగిల్ మేజర్ విధానంపై సోమవారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపకులకు అవగాహన శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఐదురోజులపాటు జరిగే ఈ శిక్షణలో కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే పాల్గొని మాట్లాడుతూ 2023 విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ విద్యార్థులకు సింగిల్ మేజర్ సిస్టంను ప్రవేశపెట్టడం జరిగిందని, ఈ విధానంపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనరేట్ ఆదేశాల మేరకు అధ్యాపకులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆర్ట్స్ కళాశాల వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు బి.ప్రతిమ, కాకినాడ ఏఎస్‌డీ కళాశాల నుంచి శిరీషరెడ్డి, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎ.అన్నపూర్ణ పాల్గొన్నారు.

టెడ్‌లెన్స్ ఐటీ సొల్యూషన్స్‌తో అవగాహన ఒప్పందం

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం టెడ్‌లెన్స్ ఐటీ సొల్యూషన్స్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే తెలిపారు. ఈమేరకు సదరు కంపెనీ కళాశాలలో సెంటర్ ఫర్ టెక్నికల్ ఎక్స్‌లెన్స్ కేంద్రాన్ని ఏర్పాటుచేసి విద్యార్థులకు వివిధ ఐటీ కంపెనీల్లో ఉద్యోగావకాశాల సాధనకు శిక్షణ ఇవ్వడంతోపాటు అంకుర సంస్థల స్థాపనకు కావాల్సిన నైపుణ్యాలను పెంపొందించడం చేస్తారని అన్నారు. టెడ్‌లెన్స్ ఐటీ సొల్యూషన్స్ సీఈవో శ్రీరామదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్, కళాశాలలు సంఘటితం కావాలి : టీకే

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 18: నగరంలోని ప్రైవేట్ స్కూల్స్, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు కలసికట్టుగా సంఘటితమై ఒక యూనియన్‌గా ఏర్పడాలని రాజమహేంద్రి విద్యాసంస్థల ఛైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. స్థానికంగా ప్రైవేట్ కాలేజీలు, స్కూల్స్ అసోసియేషన్ తరపున ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సమస్యలన్నింటినీ ఒక వినతిపత్రంగా తయారుచేసి ప్రతి రాజకీయపార్టీకి, రాజకీయ నాయకునికి మెమోరాండంగా అందజేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో రాజమహేంద్రి అన్ ఎయిడెడ్ కాలేజెస్ అండ్ స్కూల్స్ అసోసియేషన్ (రుక్సా)గా ఏర్పాటయ్యారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్ ప్రైవేట్ వైద్యుల సదస్సు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 18: ఆర్థోపెడిక్ వైద్యులంతా ఎప్పటికప్పుడు తమ నైపుణ్యానికి మెరుగులు దిద్దుకోవాల్సిన అవసరం ఉందని పలువురు ఆర్థోపెడిక్ వైద్యులు పేర్కొన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలో ఆర్థోపెడిక్ ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యుల సదస్సు జరిగింది. గోదావరి ఆర్థోప్లాస్టి పేరుతో జరిగిన ఈ సదస్సులో ఎముకలు, కీళ్లవైద్యంలో వస్తున్న మార్పులు, అనుసరించాల్సిన వైద్యవిధానాలపై పలువురు ప్రముఖ వైద్యులు దిశానిర్దేశం చేశారు. కోయంబత్తూరుకు చెందిన డాక్టర్ ధనశేఖర్ రాజా మాట్లాడుతూ సర్జరీలో ఎదురయ్యే సమస్యలను వివరించారు. డాక్టర్ ఆదిత్య కృష్ణ, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ జేవీ శ్రీనివాస్, డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

రాజానగరం, మార్చి 18: డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రాధేయపాలెం గ్రామంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల పెంపకంలో తల్లుల పాత్ర ముఖ్యమైందని, తమ సంస్థ టైలరింగ్‌లో అందిస్తున్న ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధి దిశగా పయనించాలని ఆకాంక్షించారు. ఉచిత టైలరింగ్‌లో ఈవూరి దుర్గ శిక్షకురాలిగా వ్యవహరిస్తారు. మేనేజింగ్ ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, వీరాస్వామి, సుమారు 50 మంది మహిళలు, యువతులు శిక్షణ కార్యక్రమానికి హాజరవుతున్నట్టు చెప్పారు.



మెళ్లూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మనోజ్‌రెడ్డి

నల్లమిల్లి కోసం తనయుడి ప్రచారం

బిక్కవోలు, మార్చి18: అనపర్తి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని గెలిపించాలంటూ తనయుడు నల్లమిల్లి మనోజ్‌రెడ్డి సోమవారం మెళ్లూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన టీడీపీ మేనిఫెస్టోలోని యువగళం, అన్నదాత, ఇతర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తన తండ్రి రామకృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈయన వెంట టీడీపీ నేతలు చవ్వాకుల చినబాబు, వట్టూరి అర్జున్, పెద్దిరెడ్డి బాబ్జి, చవ్వాకుల రాంబాబు, చల్లా ప్రగడారావు, అమజాల జానకిరామయ్య, గంగుమళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూడు పార్టీల కలయికతో జగన్ గుండెల్లో రైళ్లు : కాశి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 18: రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన ఈ మూడు పార్టీ కలయికతో జగన్‌రెడ్డి గుండెల్లో రైళ్ల పరుగెడుతున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ అన్నారు. చిలకలూరిపేటలో కూటమి సభ విజయవంతమైన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ పార్టీకి కాలం చెల్లిందన్నారు. ప్రజలను నమ్మించి దగా చేసిన జగన్‌కు తగిన గుణపాఠం చెప్పబోతున్నారని, అందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అధికార మదంతో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల ప్రజలపై అక్రమ కేసులు బనాయించి, దాడులకు తెగబడిన వైసీపీ గూండాలకు తమ ఓటుతో బుద్ధిచెప్పబోతున్నారని, కూటమి కొత్త చరిత్ర సృష్టించబోతోందన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

రాజమహేంద్రవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రోహిత్‌కుమార్ అనే యువకుడు రాజమహేంద్రవరం పరిధిలోని క్వారీ మార్కెట్ సమీపంలోని జేసీబీల సంస్థలో జేసీబీ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఈనెల 3న జార్ఖండ్ వెళ్తానని సెలవు తీసుకున్నాడని, ఈరోజు వరకూ అక్కడి చేరలేదని అతడి బంధువుల ద్వారా తెలిసింది. దీంతో ఆ సంస్థ యజమాని ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 19 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళ) సా.6.22
సహరి(బుధ) ఉ.4.48

ఎండా కాలమ్
	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	38.0	22.0



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే శేషారావు, ప్రసాద్ తదితరులు

దుర్గేష్ గెలుపే.. మన గెలుపు

నిడదవోలు టీడీపీ నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో శేషారావు పిలుపు

నిడదవోలు, మార్చి 18 : ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే..నన్ను గెలిపించినట్లేనని నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి , మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. నిడదవోలు పట్టణంలోని లయన్స్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీకి కంచుకోట నిడదవోలు నియోజకవర్గం అన్నారు. అటువంటి నియోజకవర్గానికి తెలుదేశం, జనసేన, బీజేపీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా జనసేన నుంచి కందుల దుర్గేష్‌ను ఎంపిక చేశారన్నారు. రానున్నది తెలుగుదేశం, జనసేన, బీజేపీల ఉమ్మడి ప్రభుత్వమని అన్నారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి కందుల దుర్గేష్‌ను గెలిపించాలన్నారు. దుర్గేష్ గెలుపే మన గెలుపని అన్నారు. మన ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటి విడతలో తనకు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అనంతరం కందుల దుర్గేష్‌ను సమావేశానికి ఆహ్వానించి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పరిచయం చేశారు. దీనిలో భాగంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ మీ అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎమ్మెల్యే అయినా ఇక్కడే ఉంటానని తెలిపారు. సమావేశంలో పట్టణ మండల అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, వెలగన సూర్యారావు, తిరుపతి సత్యనారాయణ, పంచదార దుర్గాప్రసాద్, భూపతిరాజు రవివర్మ, ఉండ్రాజవరం, పెరవలి మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



కొవ్వూరు వైసీపీ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాపు కాస్తున్నా.. పదవుల్లేవ్!

- కొవ్వూరులో మళ్లీ భగ్గుమన్న విభేదాలు
- మండిపడిన వైసీపీ కాపు నాయకులు
- సమన్వయకర్తను మార్చాలని డిమాండ్
- న్యాయం చేస్తామని నాయకుల హామీ

కొవ్వూరు, మార్చి 18 : కోడ్ కూసినా కొవ్వూరు నియోజకవర్గ వైసీపీలో విభేదాలు భగ్గుమంటూనే ఉన్నాయి. గతంలో హోంమంత్రి తానేటి వనిత ఉన్న సమయంలో కొవ్వూరు వైసీపీలో రెండు వర్గాలు ఉండేవి.ఈ నేపథ్యంలో అధిష్ఠానం కొవ్వూరు నుంచి హోం మంత్రి తానేటి వనితను గోపాలపురం, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా మార్పు చేసింది. అయినప్పటికి నియోజకవర్గంలో రెండు వర్గాలు అలానే ఉన్నాయి. నేటికీ విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. కొవ్వూరు సత్యవతినగర్‌లో సోమవారం జరిగిన సమావేశమే దానికి ఉదాహరణ. గతంలో కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్తగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్ కృష్ణ ఉండేవారు. ఇటీవల వైసీపీ అధినాయకత్వం ఆయనను తప్పించి వంకా రవీంద్రను కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. రాజీవ్‌కృష్ణను సమన్వయకర్తగా తప్పించడంతో హోంమంత్రి తానేటి వ్యతిరేక వర్గం, రాజీవ్‌కృష్ణ అనుచరగణంగా పేరుగాంచిన వర్గం నాయకులు పార్టీ కార్యక్రమాలపై కొంత కినుక వహించారు. ఏం జరిగిందో ఏమో గాని మరలా రాజీవ్‌కృష్ణకే కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్తగా వైసీపీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. దీనిపై కాపు సామాజిక వర్గ నాయకులు మండిపడుతున్నారు. నియోజకవర్గంలో పార్టీ కోసం ఎంత కష్టపడినా గుర్తింపు లభించడం లేదని వాపోతున్నారు. నియోజకవర్గంలో సమన్వయకర్తగా 50 వేల ఓటర్లు ఉన్న తమ సామాజికవర్గం నుంచే సమన్వయకర్తను నియమించాలని కాపు నాయకులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఎన్నికల వేళ వైసీపీ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.దీనిపై స్పందించిన పార్లమెంటు అభ్యర్థి డా. గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో జరిగిన తప్పిదాలు జరగవు. ఎన్నికల తరువాత కష్టపడిన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. అభ్యర్థి తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఎవరు కష్టపడతారో వారికే న్యాయం చేస్తూ అందరిని కలుపుకుని వెళతామన్నారు. మీ డిమాండ్‌ను అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతామన్నారు.కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు బండి పట్టాభిరామారావు, మైపాల రాంబాబు, అడ్డగర్ల వీరాస్వామి, తోట రామకృష్ణ, వగ్రే మురళి, కొయ్యల భాస్కర్, నగళ్ళపాటి శ్రీనివాస్, అడ్డూరి సుబ్బారావు, తోట లక్ష్మీప్రసన్న, గండ్రోతు శివరామకృష్ణఅల్లు శ్రీను, చిలంకుర్తి బాబి, రుద్రం వీరబాబు, గంటా చిరంజీవి, ఇతర సంఘాల నాయకులు ముదునూరి నాగరాజు, సర్పంచ్‌లు తానేటి కుమారి, మట్టా శ్రీను, ముప్పిడి విజయరావు, వరిగేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంఘనులు!

పట్టించుకోడ్!



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలా...

- కొండెక్కుతున్న ఎన్నికల కోడ్
- ఇంకా తొలగని వైసీపీ హోర్డింగ్స్
- జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వాహనాలపై అదే బొమ్మ
- అక్కడక్కడా సిద్ధం అంటూ జగన్ కటౌట్లు
- గ్రామాల్లో తొలగని నువ్వే మా నమ్మకం జగన్
- చోద్యం చూస్తున్న అధికారులు
- మండిపడుతున్న ప్రతిపక్ష నాయకులు

రాజమహేంద్రవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికారుల్లో నిర్లక్ష్యం మాత్రం ఇంకా వీడిపోలేదు. ఇంకా జిల్లా వ్యాప్తంగా ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ వేలాడుతూనే ఉన్నాయి. కోడ్ వచ్చిన 24 గంటల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశించిన గడువు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. అయినా చాలా చోట్ల ఉల్లంఘనలు కనిపిస్తున్నాయి. శాఖాపరంగా కూడా స్పష్టమైన ఆదేశాలు ఉన్నా నిర్లిప్తంగా వ్యవహరిస్తుండడంపై ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకొనే అవకాశం లేకపోలేదంటున్నారు. కొన్ని చోట్ల ఎన్నికల ప్రవర్తనా నియమావళి పట్టించుకున్నట్లు కానరావడం లేదు. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ప్రధాన గేటుదాటి లోనికి అడుగుపెట్టగానే కుడిచేతివైపున జిల్లా ప్రధాన ఆసుపత్రి అని పెద్ద బోర్డు ఉంది. దానిపై జగన్, రాజశేఖరరెడ్డి చిత్రాలు ఉన్నాయి. మహాప్రస్థానం, రక్త సేకరణ వాహనాలపై అవే బొమ్మలు దర్శనమిస్తున్నాయి. ఆస్పత్రి లోపల ఆరోగ్యశ్రీ కియోస్కోపై ఉన్న జగన్, రాజశేఖరరెడ్డి చిత్రాలకు మొక్కుబడిగా అతికించిన కాగితాలు ఊడిపోతున్నాయి. సుమారు రెండు నెలల పాటు ఎన్నికల కోడ్ అమల్లో ఉండే అవకాశం ఉండగా బొమ్మలపై కాగితాలు అతికించడం, అవి రెండు రోజులకే ఊడిపోవ డం విమ ర్శలకు తావిస్తోంది. తాడితోట జంక్షనులోని రైల్వే ట్రాక్ పక్కనే ఏర్పా టు చేసిన జగన్ ఫ్లెక్సీ అధికారులకు కానరాకపోవడంపై జనం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఫ్లెక్సీని కరెంటు స్తంభానికి కట్టినా పట్టింపు లేదు. జక్కంపూడి ఫౌండేషన్‌కి చెందిన మహాప్ర స్థానం అంబులెన్సులో ఆస్పత్రి ప్రాంగణ ంలోనే పార్కింగ్ చేస్తున్నారు. అయితే దాని పై జగన్ బొమ్మ తొలగించకపోవడంపై ఆరోపణలు వినవస్తున్నాయి. నగరంలో చాలా చోట్ల ఇంకా సీఎం సిద్ధం ఫ్లెక్సీలు దర్శనమిస్తూనే ఉన్నాయి. అవి తొలగించకపోవడంపై ప్రతిపక్ష నాయకులు మండిపడుతున్నారు. మా నాయకుల ఫ్లెక్సీలు తొలగించి వైసీపీ నాయకుల ఫ్లెక్సీలు మాత్రం అలాగే వదిలేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అన్నీ ఫ్లెక్సీలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.





ప్రభుత్వాసుపత్రిలో వాహనాలపై ఇలా..



రాజమహేంద్రవరంలో జగన్ సిద్ధం ఫ్లెక్సీ

సీతానగరంలో ఇలా..

సీతానగరం,మార్చి 18 : సీతానగరం మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీకి చెందిన పలు హోర్డింగ్స్ ,కటౌట్లు ఇంకా దర్శనమిస్తూనే ఉన్నాయి. పలు గ్రామా ల్లో మా నమ్మకం నువ్వే జగన్ అన్న హోర్డింగ్స్ యథాతథంగా కనిపిస్తుంటే వెదుళ్ళపంచాయతీ పరిధిలోని రాజంపేట వద్ద ప్రధాన రహదారికి పక్కనే ఉన్న వైసీపీ కటౌట్ అలాగే వదిలేశారు. తూతూమంత్రంగా చిన్న బరకం కప్పి చేతులు దులుపుకున్నా గాలికి ఆ బరకం ఎగిరిపోతోంది. అయినా పంచాయతీ అదికారులు పట్టించుకోవడం లేదు.పంచాయతీ కార్యదర్శి సూర్యకుమారిని వివ రణ కోరగా వైసీపీ నాయకులు కటౌట్‌కు ఆర్డీవో నుంచి అనుమతి తెచ్చుకున్నారని తెలిపారు.ఆ ఫ్లెక్సీకి అనుమతి ఉంటే బరకం ఎందుకు కప్పారనేది ప్రశ్నార్థకం. సీతానగరం పంచాయతీ పరిధిలోని బసవేశ్వర స్వామి గుడి సమీపంలో, రాపాక అంజనేయస్వామి గుడి సమీపంలోను జగన్ హోర్డింగ్‌లు యథాతథంగా కనిపిస్తున్నాయి

ఇక తొలగించరా!

నిడదవోలు, మార్చి 18 : ఎన్నికల ప్రవర్తనా నియమావళి అధికారులు ఖచ్చితంగా అమలు చేయాలి. అయితే కోడ్ అమల్లోకి వచ్చి మూడు రోజులు అవుతున్నా సీఎం జగన్, ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు కటౌట్స్ అధికార్లు తొలగించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిడదవోలు పట్టణంలోని సుబ్బరాజుపేటలో సోమవారం సీఎం జగన్, ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు కటౌట్ ఇలా దర్శనమిచ్చింది.



సీతానగరం, రాపాకలో ఆలయాల గోడలపై వేలాడుతున్న మా నమ్మకం నీవే జగన్ హోర్డింగ్స్

ఇసుక.. ఇష్టానుసారంగా..



- ఆగని ఇసుక అక్రమాలు
- కోడ్ వచ్చినా మారని తీరు
- పట్టని అధికార గణం
- ఏమీ చేయని టాస్క్‌ఫోర్స్
- యథేచ్ఛగా తవ్వకాలు
- నాయకుల ఇష్టారాజ్యం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఇసుక అక్రమాలు ఆగలేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికారులు నిద్ర నటించడం మానడంలేదు. అధికారులు ఇంకా వైసీపీ సేవలోనే నిమగ్నమయ్యారు. ఇంతకాలం యథేచ్ఛగా ఎన్ని అక్రమాలు జరిగినా పట్టించుకోకుండా జిల్లా యంత్రాంగం వైసీపీ సేవల్లో తరించిన సంగతి తెలిసిందే. వైసీపీ అధిష్ఠానానికి భయపడి కళ్లెదుటే అక్రమాలు, దోపిడీ జరుగుతున్నా మౌనం వహించారు. కానీ ఇవాళ ఎన్నికల షెడ్యూల్ వచ్చి మూడు రోజులు దాటిపోయింది. అయినా అఖండ గోదావరితో పాటు ఇతర ప్రాంతాల్లో ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరిగిపోతోంది. ఇసుక అక్రమాలు ఆపడం కోసం ఫిబ్రవరి 17వ తేదీన జిల్లా కలెక్టర్ ఐదుగురు సభ్యులతో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు.అది ఏర్పాటు చేసి నెల దాటిపోయింది. ఈ టాస్క్‌ఫోర్స్ సభ్యులు ఏమయ్యారో.. ఏమి చేస్తున్నారో కానీ ఇసుక అక్రమాలను ఆపలేకపోతున్నారు.

కళ్లెదుటే సాగుతున్నా..

అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయనే ఫిర్యా దుల నేపథ్యంలో ఎస్ఈబీ,మైన్స్, ఇరిగేషన్, పోలీసు, రెవెన్యూ అధికార్లతో టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు.ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కానీ ఎన్నిక కేసులు నమోదు చేశారు. గోదావరిలో అక్రమంగా డ్రెడ్జింగ్ జరిగిపోతోంది. ఒక పద్ధతి లేకుండా దోపిడీ సాగుతోంది. గతేడాది మే నెల నుంచి తవ్వేసిన ఇసుక అక్రమాలు మళ్లించడానికి గతంలో అనుమతించిన ఓ డ్రెడ్జింగ్ కాంట్రాక్టరు గత డిసెంబర్‌లో రంగంలోకి దింపి అంతా వాళ్లే చేస్తున్నట్టు రంగు పూసింది. వాళ్లు ఒక పక్క నిబంధనలు పాటించకుండా డ్రెడ్జింగ్ చేస్తున్నారు. అది కాకుండా గాయత్రి, కాతేరు, కోటిలింగాల, కొవ్వూరు డివిజన్ పరిధిలోనూ అనధికారి కంగా డ్రెడ్జింగ్‌లో రోజుకే వేలాది టన్నులు ఇసుక తవ్వేస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఇసుక తీసి ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. భద్రత చర్యల్లో భాగంగా బ్యారేజీ, రోడ్ కమ్ రైలు బ్రిడ్జి, రైలు వంతెనలకు 500 మీటర్ల లోపు తవ్వకాలు నిషేధమని అధికారులు ప్రకటించారు. హద్దులు ఏర్పాటు చేసి బ్యారికేడ్లు కూడా ఏర్పాటు చేస్తారు. అయినా అసలు పట్టించుకోలేదు. వంతెన పక్క కూడా ఇసుక తవ్వేస్తున్నారు. గతంలో రోడ్ కమ్ రైలు బ్రిడ్జి పక్కన ఇసుక తవ్వడం వల్ల నిపుణుల కమిటీ హెచ్చరించింది. బ్రిడ్జికి ప్రమాదం ఉందని స్పష్టం చేసింది. అయినా ఖాతర్ చేయలేదు. ఇవాళ గామన్ బ్రిడ్జికి 800 మీటర్లకు ఇవతలే తవ్వాలనే అధికారులు పెట్టిన నిబంధన కూడా పాటించడం లేదు. బ్రిడ్జికి అతి సమీపంలో తవ్వేస్తున్నారు.కానీ ఒక్క అధికారీ పట్టించుకోవడంలేదు.ఇంకా వైసీపీ నేతలు అధికారుల మీద ఒత్తిడి తెస్తున్నారని, అందుకే వారేమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితులు ఇంకా కొనసాగితే టాస్క్‌ఫోర్స్ అధికారులు , సంబంధిత శాఖల అధికా రుల కచ్చితంగా ప్రమాదంలో పడకతప్ప దనే ప్రచారం కూడా జరుగుతోంది.

విమానాశ్రయంలోనూ ఎన్నికల తనిఖీలు

- రూ. 50 వేలు మించి నగదున్నా సీజ్
- ఏదైనా పట్టుబడినా వెంటనే అప్‌లోడ్ చేయాలి

రాజమహేంద్రవరం, మార్చి18(ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో సీజ్ చేసిన నగదు, ఇతర వస్తువుల వివరాల నివేదికను 24 గంటల్లోపు ఇవ్వాలని, ఈఎస్ఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.మాధవీలత, జిల్లా ఎస్పీ పి.జగదీశ్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమీక్షించారు.ఎన్నికల నేపథ్యంలో సీజ్ చేసి నగదు, మద్యం అమ్మకాలు, ఇతర వస్తువుల పంపిణీ వంటి వాటి వివరాలను రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ నోడల్ ఏజెన్సీలు నిర్దేశించిన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రజలు ఎన్నికల సమయంలో రూ.50వేలు కంటే ఎక్కువ మొత్తం తీసుకుని వెళ్లకూడదని, తగిన ఆధారాలు చూపకపోతే ఫ్లైయింగ్ స్క్వాడ్ సీజ్ చేస్తుందన్నారు. ఎవరైనా రూ. 10 లక్షలకు పైబడిన సొమ్ముతో దొరికినా వెంటనే సీజ్ చేస్తామని తర్వాత ఆధారాలు ధ్రువీకరిస్తే ఇస్తారన్నారు. విమానాశ్రయంలో వాణిజ్య, వాణిజ్యేతర విమానాశ్రయాలు, హెలిప్యాడ్‌లలో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, బ్యాగేజీలీ స్క్రీనింగ్, ఫిజికల్ చెకింగ్ నిర్వహిస్తారన్నారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ ఆడిట్ అధికారి,ఎన్‌ఫోర్స్‌మెంట్ నోడల్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా ఎక్సయిజ్ అధికారి వై.శ్రీలత, స్టేట్ జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ జే.నీరజ,అటవీ అధికారి బి.నాగరాజు, ఐటీ అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న కలెక్టర్ మాధవీలత

టెన్షన్ ఆరంభం

పది పరీక్షలు ప్రారంభం

రాజమహేంద్రవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమ య్యాయి. తొలి రోజు కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో కాస్త ఆందోళన కనిపించింది. పరీక్షా కేంద్రాల వెతుకులాటతో పరుగులు పెట్టారు. పలు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్ తనిఖీ చేశారు. సదుపాయాల ఏర్పాట్లపై ఆరా తీశారు. బందోబస్తును పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 25,399 మంది విద్యా ర్థులు దరఖాస్తు చేసుకోగా మొదటి రోజు పరీక్షకు 23,998 మంది హాజరయ్యా యరని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి అత్యవసర మందులతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉంచామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలూ తీసుకోవడం జరిగిందన్నారు. పరీక్షలు జరుగుతున్న రోజుల్లో విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి వీలుగా సదుపాయాలు కల్పించామని జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు పేర్కొన్నారు. పలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.



కొవ్వూరులో విద్యార్థులను తనిఖీ చేస్తున్న విద్యాధికారులు





రూమ్ నెంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

ఎస్ఎస్‌సీ బోర్డు.. ఇదేం తీరు

ఎస్ఎస్‌సీ బోర్డు తీరుతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. పరీక్షా కేంద్రాలు ఉన్న స్కూల్స్ పేరును హాల్ టికెట్లలో ఇష్టానుసారం షార్ట్‌కట్‌గా ముద్రించడం అయోమయానికి దారితీసింది. హాల్ టికెట్లలో పరీక్షా కేంద్రం పేరును పూర్తిగా కాకుండా పొడి అక్షరాల్లో పొట్టిగా గజిబిజిగా రాయడంతో సరిగా అర్థంకాక తల్లిదండ్రులు, విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. కొన్ని చోట్ల పరీక్షా కేంద్రం వద్ద సిబ్బందికీ అర్థంకాని పరిస్థితి తలెత్తింది. ఒక పరీక్షా కేంద్రానికి వచ్చిన విద్యార్థులకు వారి కేంద్రం అక్కడ కాదని సిబ్బంది చెప్పడంతో ఉరుకులు పరుగులు పెట్టారు. ఉదాహరణకు కాశీ స్పెషల్ మునిసిపల్ హైస్కూల్ పేరును కేఎస్పీ అని.. నాగరాజా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఒకేచోట ఉంటాయి. కానీ, హాల్ టికెట్‌పై ఆ రెండు పేర్లలోనూ ఏదీ కాకుండా నాగరాజా స్పెషల్ హైస్కూల్ అని ముద్రించారు. దీనికి తోడు ఇంటర్ పరీక్షలు కూడా కొన్ని పది పరీక్షా కేంద్రాల్లో ఉండడంతో తికమక తప్పలేదు.

నేటి నుంచి నరసన్న బ్రహ్మోత్సవాలు



కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఫాల్గుణ శుద్ధ చవితి మంగళ వారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమయ్యే స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 25వ తేదీ సోమవారం శ్రీ పుష్ప యాగంతో పరిసమాప్తం కానున్నాయి.ఈ మేరకు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొండంతా విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు వేశారు. వారం రోజులు పెద్ద ఎత్తున తీర్థం జరుగుతుంది. ఈ సందర్భంగా ఎక్కడెక్కడి నుంచో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు. - కోరుకొండ



బీసీలు టీడీపీకి వెన్నెముక: ముప్పిడి


కలవలపల్లిలో ఐక్యతా అభివాదం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

చాగల్లు, మార్చి 18: తెలుగుదేశం పార్టీకి వెన్నెముక బీసీలని టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని కలవలపల్లిలో జరిగిన టీడీపీ బీసీ సదస్సుకు ఆయన విచ్చేసి మాట్లాడారు. బీసీలను రాజకీయంగా ఉన్నత స్థాయిలో నిలిపింది టీడీపీయేనని, సంపద సృష్టికర్త చంద్రబాబు అయితే వాటిని తాకట్టు పెట్టి బలికే స్థాయికి జగన్ దిగజారిపోయారని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని, అందుకోసమే బీజేపీ, జనసేనలతో కలిసి పోటీ చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సుమారు 25 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. సదస్సులో మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, నాదెళ్ల నాని, గూడపాటి వెంకట్, అబ్బూరి సీతారాముడు, వత్తిపాటి శశాంక్, జనసేన నాయకులు కె.ఆంజనేయులు, నరేంద్ర పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయక ఆలయ ప్రతిష్ఠోత్సవాలు

నల్లజర్ల, మార్చి 18: మండలంలోని చీపురుగూడెంలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక ఆలయ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, అగ్ని మదనం, జలాధివాసం, క్షీరాధివాసం, మూర్తిహోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మోడల్ కోడ్ అందరూ పాటించాలి


తాళ్లపూడి ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారులతో తహశీల్దార్ శ్రీనివాసరావు

తాళ్లపూడి, మార్చి 18: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో మోడల్ కోడ్ అమలులోకి వస్తుందని, దానిని అందరూ పాటించాలని ఏఈఆర్వో, తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల చిత్రపటాలు, విగ్రహాలు కనిపించకుండా ముసుగు వేయాలని, పోస్టర్లు తొలగించాలని చెప్పారు. దీనిలో భాగంగా తాళ్లపూడి ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. అక్కడ నాయకుల చిత్రపటాలు కనిపించకుండా మూయించారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నిడదవోలు, మార్చి 18: సారా తయారు చేసినా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సమిశ్రగూడెం ఎస్ఐ రమేష్ అన్నారు. సోమవారం నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. గ్రామానికి చెందిన పాతాళ సుజన్‌రావు 10 లీటర్ల సారాను విక్రయించేందుకు సిద్ధంగా ఉండగా అతడిని అరెస్ట్ చేసి సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా పోలమ్మ గ్రామోత్సవం



నల్లజర్ల, మార్చి 18: అనంతపల్లిలో రజకుల ఇలవేల్పు పోలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనంపై అమ్మవారిని అలంకరించి మేళతాళాలు, బాణసంచాతో గ్రామోత్సవం జరిపారు. ఇంటింటా పసుపు నీళ్లు ఓరపోసి హారతులిచ్చారు. కార్యక్రమంలో తొంటపాక సూర్యరావు, ఏలూరు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'జవహర్‌కు న్యాయం చేయాలి'


సమావేశంలో పాల్గొన్న దళిత నాయకులు

కొవ్వూరు, మార్చి 18: కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ టిక్కెట్టును జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్‌కు కేటాయించాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కొవ్వూరు జవహర్ నివాసంలో జరిగిన సమావేశంలో దళిత నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ టీడీపీ టిక్కెట్టు కేటాయింపుపై అధిష్ఠానం పునరాలోచించుకోవాలన్నారు. జవహర్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే దళిత సంఘాలను కలుపుకుని రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో పసలపూడి సుభాష్ చంద్రబోస్, కొప్పాక నరసయ్య, మెరిపో వెంకట్రావు, గెడ్డం జాన్, మల్లిపూడి రాంబాబు, ఫకీర్ పాల్గొన్నారు.

కలియుగ దైవం ఆదిశంకరాచార్యులు

ఏర్పేడు శ్రీవ్యాస పీఠాధిపతి పరిపూర్ణనంద గిరిస్వామి


దేవరపల్లిలో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న పరిపూర్ణనంద గిరిస్వామి

దేవరపల్లి, మార్చి 18: సాక్షాత్తు ఆ పరమశివుడే కలియుగంలో ఆది శంకరాచార్యులుగా ఈ భూమ్మీద అవతరించాడని ఏర్పేడు శ్రీవ్యాస పీఠాధిపతి పరిపూర్ణనంద గిరిస్వామి అన్నారు. దేవరపల్లిలో సోమవారం ఆదిశంకరాచార్య మందిరంలో ఆయన వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామిజీకి పాదపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిశంకరాచార్యులు హిందూ ధర్మాన్ని పరిరక్షించారని, ప్రతిఒక్కరు భక్తిభావంతో ఉండి ధర్మాన్ని కాపాడాలని, ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలన్నారు. ఏర్పేడు ఈ నెల 24న వ్యాసపీఠం వార్షికోత్సవాలు హైదరాబాద్‌లో నిర్వహిస్తామని తెలిపారు. తమ ఆశ్రమం ద్వారా 450మంది విద్యార్థినులకు 1వ తేదీ నుంచి డిగ్రీ వరకు విద్యాసౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆదిశంకరాచార్యులు జ్ఞాన మందిరం కమిటీ సభ్యులు చలంచర్ల వెంకట హరినాథ్, తోట సత్యనారాయణ, నారాయణ విశ్వేశ్వరరావు, సత్యనారాయణ, రామారావు, వెంకటేశ్వరరావు, బాళ్ల సూర్యచక్రం, మహిళా భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

దేవరపల్లి, మార్చి 18: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. ఈ నెల 11న దేవరపల్లి డైమండ్ జంక్షన్ సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు జరుగుతున్న ప్రాంతంలో గుర్తుతెలియని ఓ వ్యక్తిని రాజమండ్రి వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. దీంతో అతడిని 108వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు దేవరపల్లి పోలీస్‌స్టేషన్ నెంబర్‌కు 9440796624కి ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.


కొవ్వూరు గవర్నమెంటు హైస్కూల్ వద్ద విద్యార్థులు


దేవరపల్లిలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

మొదటి రోజు 416 మంది గైర్హాజరు

» పదో తరగతి పరీక్షలు ప్రారంభం

» విద్యార్థులను తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపిన సిబ్బంది

కొవ్వూరు, మార్చి 18: కొవ్వూరు పట్టణ, మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 8:45గంటలకు పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపించారు. మొత్తం 8 పరీక్షా కేంద్రాల్లో 1365 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 1290 మంది హాజరయ్యారు. 75 మంది గైర్హాజరయ్యారయినట్టు డీవైఈవో తెలిపారు. జడ్పీ హైస్కూల్, పంగిడిలో 160మందికి 148, కుమారదేవంలో 128కి 125, వాడపల్లిలో 228కి 213, కొవ్వూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 217కి 210, మున్సిపల్ హైస్కూల్లో 190కి 175, ఏఎస్ జడ్పీ గరల్స్ హైస్కూల్లో 116కి 106, సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్లో 180కి 176, వేములూరు దీప్తి హైస్కూల్లో 146 మందికి 137 మంది విద్యార్థులు హాజరయ్యారు.

తాళ్లపూడిలో 638 మంది హాజరు

తాళ్లపూడి, మార్చి 18: పదో తరగతి పరీక్షలకు మండలంలో తాళ్లపూడి, వేగేశ్వరపురం, మలకపల్లి-ఎ, మలకపల్లి-బిలలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు 716మందికి 638 మంది హాజరయ్యారని ఎంఈవో నెహ్రూజీ తెలిపారు. ఇదిలా ఉండగా తాళ్లపూడి ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని స్కాడ్ డీవైఈవో సూర్యనారాయణ సందర్శించారు.

108 మంది విద్యార్థులు గైర్హాజరు

నిడదవోలు, మార్చి 18: నిడదవోలు పట్టణ, మండలంలో తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1604 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావలసి ఉండగా 1496 మంది హాజరు కాగా 108 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో గణేష్ తెలిపారు.

155 మంది విద్యార్థులు గైర్హాజరు

గోపాలపురం, మార్చి 18: మండలంలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్షా కేంద్రాల్లో మొదటిరోజు జరిగిన పరీక్షకు 1021మంది విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా 866మంది హాజరైనట్టు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. 155 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

చాగల్లులో 62 మంది గైర్హాజరు

చాగల్లు, మార్చి 18: మండలంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో 456 మంది విద్యార్థులకు గాను 394 మంది పరీక్షలకు హాజరయ్యారు. 62 మంది గైర్హాజరయ్యారు. చాగల్లు జడ్పీ హైస్కూల్లో 186 మందికి గాను 155 మంది, ఊనగట్ల హైస్కూల్లో 203 మందికి గాను 177 మంది, మార్కొండపాడు హైస్కూల్లో 67 మందికి గాను 62 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను ఎంఈవో వి.ఖాదర్‌బాబు పర్యవేక్షించారు.

ఉండ్రాజవరంలో 47 మంది గైర్హాజరు

ఉండ్రాజవరం, మార్చి 18: మండలంలో 5 పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయినట్టు ఎంఈవో సక్సేనరాజు తెలిపారు. వేలివెన్నులో మూడు కేంద్రాలు, ఉండ్రాజవరంలో రెండు కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. మొత్తం 1102మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 47మంది గైర్హాజరనట్టు చెప్పారు.

దేవరపల్లిలో 948 మంది హాజరు

దేవరపల్లి, మార్చి 18: మండలంలో దేవరపల్లి జడ్పీ హైస్కూల్, యర్నగూడెం జడ్పీ హైస్కూల్, దేవరపల్లి చైతన్య స్కూల్, భాష్యం స్కూల్, చిన్నాయగూడెం జడ్పీ పాఠశాల కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించినట్టు ఎంఈవోలు ఎస్.తిరుమలదాసు, ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. మొత్తం 1013మంది విద్యార్థులు పరీక్షలు రాయల్సి ఉండగా 948 మంది హాజరయ్యారన్నారు. వీరిలో రెగ్యూలర్ విద్యార్థులు 947మందికి గానూ 917మంది, గతంలో ఫెయిలైన విద్యార్థులు 66మందికి గాను 31మంది పరీక్ష రాశారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించినట్టు చెప్పారు.

ఐదు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు

పెరవలి, మార్చి 18: మండలంలోని కానూరు-ఎ, కానూరు-బి, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖాధికారి స్వరూప్ తెలిపారు. ఇందుకు 60మందిని అబ్జర్వర్లుగా నియమించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 635మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 301 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని చెప్పారు.


తాళ్లపూడి: వేగేశ్వరపురంలో రూం నెంబర్లు వెతుకుతున్న విద్యార్థులు


గోపాలపురం హైస్కూల్ వద్ద పరీక్షా కేంద్రంలో విద్యార్థులు

రాబోయే ఎన్నికల్లో టీడీపీకి అఖండ మెజారిటీ

» గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు

» దేవరపల్లిలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల ఆత్మీయ సమావేశం


ఐక్యతా అభివాదం చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

దేవరపల్లి, మార్చి 18: తెలుగుదేశం పార్టీ 2024 ఎన్నికల్లో అఖండ మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. సోమవారం దేవరపల్లిలో కరుటూరి ఫంక్షన్‌హాలులో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మద్దిపాటి మాట్లాడుతూ మంత్రి తానేటి వనిత ఓటమి భయంతోనే అన్ని వర్గాలకు ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి గిఫ్టులు, వివిధ రూపాల్లో బహుమతులు అందజేస్తున్నారన్నారు. ముగ్గురు మహాయోధుల కలయికతో గోపాలపురం నియోజకవర్గంలో టీడీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక అవినీతి, అరాచక పాలన జరిగిందని, ఆపార్టీని సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వలంటీర్లపై చంద్రబాబుకు కోపం లేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామన్నారు. నియోజకవర్గంలో 79 వేల ఇళ్లున్నాయని 20 రోజుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసి టీడీపీ ఉమ్మడి మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తామన్నారు. బుధవారం గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాతను దర్శించుకుని అక్కడి నుంచి ద్వారకా తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనానికి పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ జోన్-2 ఇన్‌చార్జి సుజయ కృష్ణరంగారావు జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, అసెంబ్లీ సాక్షిగా రాజధాని అమరావతి అని, ఆపై మాట మార్చి మూడు రాజధానులంటూ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. ఒక్క ఛాన్స్ అంటూ సీఎం పీఠాన్ని ఎక్కి, రాష్ట్రాన్ని అన్ని విధాల దోచుకుని ఆర్థిక సంక్షోభంలో పడేశారని అన్నారు. పవన్‌కల్యాణ్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని టీడీపీకి అండగా నిలిచారన్నారు. జనసేన ఇన్‌చార్జి డి.సువర్ణరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి లంచగొండితనం పెరిగిపోయిందని, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్, రొంగల సత్యనారాయణ, తాతిన సత్యనారాయణ, లంకా సత్యనారాయణ, గన్నమని హరికృష్ణ, జనసేన నాయకులు కాట్నం గణేష్, యండ్రపాటి రాజు, అనిశెట్టి గంగరాజు, బీజేపీ నాయకులు రత్నాజీ, కాట్రగడ్డ రవీంద్ర, శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు పెరవలి కంచుకోట: దుర్గేష్

పెరవలి, మార్చి 18: పెరవలి మండలం జనసేన పార్టీకి కంచుకోట అని నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. జనసేన పార్టీ పెరవలి మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిడదవోలులోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ మండలంలో పవన్‌కల్యాణ్ అభిమానులు ఎక్కువగా ఉన్నందున తన విజయం సునాయాసమని ధీమా వ్యక్తంచేశారు. మండలంలో 15నుంచి 20వేల మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో టీడీపీ, బీజేపీ కార్యకర్తలతో కలిసి సమన్వయంతో పని చేయాల న్నారు. సమావేశంలో జనసేన మండలాధ్యక్షుడు పిప్పిర రవి, నాగరాజు, తులా చినబాబు, సౌజన్య, కోటిపల్లి మురళీకృష్ణ, నాగరాజు, దంగేటి దాసు పాల్గొన్నారు.


దుర్గేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పెరవలి నాయకులు

ఉమ్మడి అభ్యర్థుల గెలుపే జనసేన లక్ష్యం: రామారావు

కొవ్వూరు, మార్చి 18: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన-టీడీపీ-బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు అన్నారు. సోమవారం కొవ్వూరు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఎస్సీ సెల్, యువజన, మహిళా విభాగాలకు అధ్యక్షులను నియమించారు. జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడంలో భాగంగా మండలస్థాయిలో కమిటీలను నియమించినట్టు చెప్పారు. కొవ్వూరు యువజన మండలాధ్యక్షుడిగా గంగుమళ్ళ స్వామి, ఏపుగంటి నాగబాబు(చాగల్లు), పూలపల్లి బాలకృష్ణ(తాళ్లపూడి)నియమితులయ్యారు. అలాగే ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా తొర్లపాటి చంద్రశేఖర(కొవ్వూరు), గెడ్డం విజయభాస్కరరావు(తాళ్లపూడి), చాగల్లు మండలాధ్యక్షుడిగా కన్నాజీ రామాంజనేయులు, కొవ్వూరు పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడిగా కల్లి శ్రీనును నియమించినట్టు రామారావు చెప్పారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపికైన

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు



రాజమహేంద్రవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని సృజనాత్మకతను జోడించి నూతన ఆవిష్కరణలు చేయడం ద్వారా మరింత మంది పిల్లలకు స్ఫూర్తిగా నిలిచారని జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కి ఎంపికైన విద్యార్థులను కలెక్టర్ మాధవీలత అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి ప్రదర్శనకి ఎంపికైన కొవ్వూరు మండలం ఐ.పంగిడి జడ్పీ హైస్కూలు విద్యార్థి బోయిశెట్టి లక్ష్మణ్, సీతానగరం మండలం రఘుదేవపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థి కేఎస్‌డీ నాగేంద్ర సోమవారం కలెక్టర్‌ని కలిశారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. విద్యార్థులను, టీచర్లను, అధికారులను ఆమె అభినందించారు.

డిగ్రీ సింగిల్ మేజర్ వ్యవస్థపై

అధ్యాపకులకు శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 18 : డిగ్రీలో సింగిల్ మేజర్ విధానంపై సోమవారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపకులకు అవగాహన శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఐదు రోజులపాటు జరిగే ఈ శిక్షణా ప్రారంభోత్సవం కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే పాల్గొని మాట్లాడుతూ 2023 విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ విద్యార్థులకు సింగిల్ మేజర్ సిస్టంను ప్రవేశపెట్టడం జరిగిందని, ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ కమిషనరేట్ సింగిల్ మేజర్ గురించి అధ్యాపకులకు శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదని తెలిపారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు అధ్యాపకుల జ్ఞానాన్ని, నైపుణ్యాలను మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. శిక్షణా కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల వాణిజ్యశాస్త్ర అధ్యాపకురాలు బి.ప్రతిమ, కాకినాడ ఏఎస్‌డీ కళాశాల నుంచి శిరీష రెడ్డి, కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఏ.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

టెడ్‌లెన్స్ ఐటీ సొల్యూషన్స్‌తో ఎంవోయూ

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం టెడ్ లెన్స్ ఐటీ సొల్యూషన్స్ అనే సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈమేరకు సదరు కంపెనీ కళాశాలలో సెంటర్ ఫర్ టెక్నికల్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు వివిధ ఐటీ కంపెనీల్లో ఉద్యోగావకాశాల సాధనకు శిక్షణ ఇవ్వడంతోపాటు అంకుర సంస్థల స్థాపనకు కావాల్సిన నైపుణ్యాలను పెంపొందించడం చేస్తారని పేర్కొన్నారు. టెడ్‌లెన్స్ ఐటీ సొల్యూషన్స్ సీఈఓ శ్రీరామదేవ్ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌పై మహిళలకు ఉచిత శిక్షణ

రాజానగరం, మార్చి 18: డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రాధేయపాలెం గ్రామంలో మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల పెంపకంలో తల్లుల పాత్ర ముఖ్యమైందని, చిన్నటి నుంచి వారిని గమనిస్తూ ఉండాలన్నారు. తమ సంస్థ టైలరింగ్‌పై అందిస్తున్న ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధి దిశగా పయనించాలని ఆయన ఆకాంక్షించారు.

కిక్ బాక్సింగ్‌లో దినేష్‌కు కాంస్యం


దినేష్‌ను అభినందిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, మార్చి18: అఖిల భారత విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థి సీహెచ్ దినేష్ కాంస్య పతకం సాధించినట్టు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు సోమవారం తెలిపారు. మీరట్‌లోని స్వామి వివేకానంద సుభార్తి విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో నన్నయ అనుబంధ కళాశాలైన రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న దినేష్ 81 కిలోల విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా దినేష్‌కు కాంస్య పతకాన్ని వీసీ అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, క్రీడాబోర్డు కార్యదర్శి బి.రామ్‌గోపాల్, కల్నల్ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ బి.మధుకుమార్, రాజోలు కళాశాల ఇంగ్లీషు లెక్చరర్ ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ ఫుడ్స్‌లో విజిలెన్స్ తనిఖీ

రెండు కేసులు నమోదు.. రూ2,204 అపరాధ రుసుం


తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

దివాన్‌చెరువు, మార్చి 18: దివాన్‌చెరువులోని సంతోష్‌నగర్‌లో బాబా డెయిరీ ఫుడ్స్ షాపులో విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ, లీగల్, మెట్రాలజీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు కలసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఆ డైరీ ఫుడ్స్‌కు ప్యాకింగ్ లైసెన్సు లేకపోవడం, అవిన్ డ్రీంక్రీమ్ 30ఎంఎల్ ప్యాకెట్స్‌పై మెండిటరీ డిక్లరేషన్ లేకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు రెండు కేసులు నమోదు చేశారు. అలాగే ట్రేడ్ లైసెన్సు పొందకపోవడంతో పంచాయతీ కార్యదర్శి రూ2,204 అపరాధ రుసుము విధించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు డైరీ నుంచి కుల్ఫీ, మీడియం ఫ్యాట్‌ఫ్రోజన్ డెజర్ట్‌ల నమూనాలను విశ్లేషణ నిమిత్తం సేకరించారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఐస్‌క్రీమ్ తయారీదారులు, స్వీట్‌స్టాల్స్, రెస్టారెంట్ల యాజమాన్యాలు వాటి పరిసరాలను, కిచెన్లు పరిశుభ్రముగా ఉంచాలని సూచించారు. వినియోగదారులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని, లేకుంటే సంబంధిత యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో అధికారులు ముత్యాలనాయుడు, భార్గవమహేష్, జగన్నాథరెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని భార్య మృతి

భర్తకు తీవ్ర గాయాలు


భార్య మృతదేహంపై పడి రోదిస్తున్న భర్త

రాజానగరం, మార్చి 18: జాతీయ రహదారిపై తూర్పుగోనగూడెం సమీపంలోని సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. గండేపల్లి మండలం ఎస్టీ రాజాపురానికి చెందిన పిల్లి లోవకుమారి(40), భర్త దుర్గారావు అనారోగ్యం కారణంగా బైక్‌పై రాజమహేంద్రవరం ఆస్పత్రికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తున్న తరుణంలో మార్గమధ్యలో తూర్పుగోనగూడెం సమీపంలో బైక్‌ను వెనుకవైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో లోవకుమారి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. దుర్గారావుకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో చికిత్స కోసం తరలించారు. సంఘటనా స్థలంలో భార్య మృతదేహం వద్ద దుర్గారావు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు స్థానికులను కలచివేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

అచ్యుతాపురంలో పిచ్చి కుక్క స్వైర విహారం

రెండున్నరేళ్ల చిన్నారి సహా పది మందికి గాయాలు


పిచ్చికుక్క దాడిలో గాయపడ్డ చిన్నారి

గోకవరం, మార్చి 18: గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో సోమవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. ఈ దాడిలో రెండున్నరేళ్ళ చిన్నారి సహా 10 మందికి గాయాలయ్యాయి. బయట నుంచి గ్రామంలోకి ప్రవేశించిన ఓ పిచ్చికుక్క కనిపించిన వారిపై దాడి చేసి కుంటూ సంచరించింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు భయంతో ఇళ్లలోకి పరుగులు తీశారు. ఆరు బయట ఉన్న పశువులు, కోళ్లను కూడా తీవ్రంగా గాయపర్చింది. గాయపడిన వారు గోకవరం ప్రభుత్వాసు పత్రికి పరుగులు తీశారు. తీవ్రంగా గాయప డిన చిన్నారిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసు పత్రికి తరలించారు. చివరకు పిచ్చి కుక్కను గ్రామస్థులు హతమార్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా గ్రామంలో సుమారు 20కి పైగా వీధి కుక్కలను పిచ్చికుక్క కరవడంతో గ్రామస్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కల నిర్మూలనకు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.